సూర్య
www.suryaa.com

ఆదివారం
అనుబంధం
18 మే 2025


# టెలికాం ప్రగతి యాత్ర



సూర్య
www.suryaa.com
18.5.2025



# చైర్మన్‌తో ముఖాముఖి



నూకారపు సూర్య ప్రకాశరావు
చైర్మన్, సూర్య తెలుగుదినపత్రిక

**రైల్వే శాఖ ప్రయాణికులకు షాకింగ్ న్యూస్ తెలిపింది. ఇకపై వెయిటింగ్ లిస్ట్ టికెట్తో రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణిస్తే భారీ జరిమానా విధిస్తారు. అంతేకాదు, మిమ్మల్ని రైలు నుంచి దించేసే అధికారం కూడా టీటీఈకి ఉంటుందని రైల్వే ప్రకటించినట్టు సామాజిక మాద్యమాలలో కనిపిస్తోంది. మీరేమంటారు.**

**దివ్వెల మాధురి, పలాస**


అవును మాధురిగారూ కన్ఫర్మ్ టికెట్ ఉన్నవారికే రిజర్వ్ బోగీల్లో ప్రయాణించే అవకాశం ఉంటుందని రైల్వే స్పష్టం చేసింది. ఈ రూల్ మే 1, 2025 నుంచి అమల్లోకి వస్తుంది. టికెట్ కన్ఫార్మ్ అయిన వారికి ఇబ్బంది కలగించకుండా ఉండటం కోసమే రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రయాణికులు సౌకర్యార్ధం రైల్వే శాఖ ఎప్పటికప్పుడు కీలక నిర్ణయాలు తీసుకుంటూ ఉంటుంది. తాజాగా వెయిటింగ్ టికెట్లకు సంబంధించి రైల్వే శాఖ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇది ప్రయాణికులకు ఒకలాంటి షాకింగ్ విషయమే అని చెప్పవచ్చు. ఈ కొత్త రూల్ అమల్లోకి వస్తే.. జరిమానా మాత్రమే కాక.. ప్రయాణికులను రైలు నుంచి దింపేసేందుకు కూడా అధికారులకు అనుమతి లభించింది. ఇంతకు రైల్వే శాఖ తీసుకున్న ఆ కొత్త రూల్ ప్రకారం భారత రైల్వే శాఖ.. ప్రయాణికులకు కీలక అలర్ట్ జారీ చేసింది. ఇకపై వెయిటింగ్ లిస్ట్ టికెట్‌తో రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణిస్తే భారీ జరిమానా విధించడమే కాక.. ఏకంగా రైలు నుంచి దింపేయడం జరుగుతుందని రైల్వే ప్రకటించింది. టికెట్ కన్ఫార్మ్ చేసుకున్న ప్రయాణికుల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే శాఖ వెల్లడించింది. దీని వల్ల టికెట్ కన్ఫామ్ అయిన ప్రయాణికలు సౌకర్యవంతంగా ప్రయాణం చేసేందుకు అకాశం లభించనుంది. ఇప్పటికీ కొందరు రైలు ప్రయాణికులు టికెట్ కన్ఫార్మ్ కాకపోయినప్పటికీ వెయిటింగ్ టికెట్‌తో రిజర్వ్ కోచ్‌ల్లో ప్రయాణం చేస్తుంటారు. టికెట్ బుక్ చేసుకున్నారు కాబట్టి వెయిటింగ్ టికెట్‌కు కూడా ఎంతో కొంత చట్టబద్ధత ఉంటుందనే నమ్మకం వీరిది. టీటీ వచ్చి టికెట్ చెక్ చేసినప్పుడు..వెయిటింగ్ టికెట్ చూపించి.. ఆ తర్వాత ఎంతో కొంత జరిమానా చెల్లించి.. రిజర్వ్ బోగిల్లో దర్జాగా ప్రయాణం చేస్తుంటారు.రైల్వే తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం ఇకపై ప్రయాణికులు వెయింటిగ్ టికెట్తో ఇలా రిజర్వ్ బోగిల్లో ప్రయాణించడం కుదరదు. టికెట్ కన్ఫార్మ్ కాకుండా ప్రయాణం చేస్తే ఫుల్ టికెట్ ధరతో పాటుగా ఫైన్ కట్టాల్సి ఉంటుంది. అలాంటి ప్రయాణికులను రైలు నుంచి దించేసే అధికారం ట్రైన్ టికెట్ ఎగ్జామినర్కు (టీటీఈ) ఉంది.అంతేకాకుండా కన్ఫర్మ్ టికెట్ లేకుండా ఏసీ, స్లీపర్ బోగీల్లో ప్రయాణిస్తే స్లీపర్కి 250 రూ., ఏసీకి 440 రూ. జరిమానాతో పాటుగా.. వారు అప్పటి వరకు ప్రయాణించిన దూరానికి ఛార్జీలు చెల్లించాలి. మే 1, 2025 నుంచి రైల్వే తీసుకున్న ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది. అంటే ఇకపై రిజర్వ్ సీట్లలో ప్రయాణించే అర్హత కన్ఫర్మ్ టికెట్స్ ఉన్న ప్రయాణికులకు మాత్రమే ఉంటుంది. కాదని ప్రయాణాలు చేస్తే.. నిర్దాక్షిణ్యంగా దింపేస్తారు. అలాగే కొన్ని రోజుల క్రితం తత్కాల్ టికెట్ల బుగింగ్ టైమింగ్ మారినట్లు కొన్ని రోజుల క్రితం జోరుగా ప్రచారం వాస్తవం కాదని రైల్వే శాఖ తెలిపిందన్నది మరో విషయం గమనించదగ్గదే.

**జమ్మూ కశ్మీర్లోని పహల్గామ్లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య సంబంధాలు క్షీణించడంపై ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ఆందోళన వ్యక్తం చేశారు. సైనిక చర్య పరిష్కారం కాదని స్పష్టం చేస్తూ, సంయమనం పాటించాలని కోరారు. శాంతియుత చర్చలకు ఐరాస మద్దతు ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అసలు శాంతి చర్చలు జరిగే పరిస్థితి ఉందా? అన్నది నా అనుమానం. మీరేమంటారు సర్.**

**పట్నాన రాజశేఖర్, సింగపూర్**

అవును రాజుగారూ... జమ్మూ కశ్మీర్లోని పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య నెలకున్న పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ఆందోళన అర్ధవంతమైనదే... ఇరు దేశాల సంబంధాలు దారుణంగా దెబ్బతిన్నాయని, ఇటీవలి సంవత్సరాల్లో ఇవే అత్యధిక ఉద్రిక్తతలు నేపథ్యంలో శాంతి చర్చలు ఎంతవరకు ముందుకు సాగుతాయన్నది అయితే, సమస్యకు సైనిక చర్య పరిష్కారం కాదన్నది సమితి అభిప్రాయం ఏప్రిల్ 22న పహల్గామ్లో జరిగిన ఉగ్రవాద దాడిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తునే 'పౌరులపై దాడులు పూర్తిగా అంగీకారయోగ్యం కావు. బాధ్యులను న్యాయబద్ధంగా, విశ్వసనీయమైన విధానంలో శిక్షించాలి' అని సమితి కార్యదర్శి ప్రకటన చేసిన విషయం తెలిసిందే. భారత్, పాకిస్థాన్లను ఉద్దేశించిన విడుదల చేసిన ప్రకటనలో 'సంమయనం పాటిస్తూ మళ్లీ ప్రతీకార చర్యల వైపు వెళ్లకుండా జాగ్రత్తగా వ్యవహరించండి' అని గుటెర్రెస్ విజ్ఞప్తి చేశారు. 'ఇరు దేశాల మధ్య సంబంధాలు ఇలా క్షీణించడం నాకు ఎంతో బాధ కలిగిస్తోంది' ఆయన అన్నారు. అంతేకాదు, శాంతి కోసం జరిగే ఎలాంటి ప్రయత్నానికైనా ఐక్యరాజ్యసమితి మద్దతు ఇస్తుందన్న హామీ ఇచ్చారు. 'ఉద్రిక్తతలను తగ్గించి.. చర్చలకు దారితీసే శాంతియుత మార్గాలను మేం ప్రోత్సహిస్తాం. ఇందుకు ఐక్యరాజ్యసమితి సిద్ధంగా ఉంది' అని తెలిపారు.ఇదిలా ఉండగా.. పహల్గామ్ దాడితో ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలకు మే 7న 'మాక్ డ్రిల్స్' నిర్వహించాలని ఆదేశించింది. వైమానిక దాడుల సమయంలో సైరన్ల వ్యవస్థ పనితీరు, పౌరులకు సివిల్ డిఫెన్స్ శిక్షణ, అత్యవసర సమయంలో ఎలా రక్షించుకోవాలో ప్రాథమిక అవగాహన, తక్షణ లౌకౌట్ చర్యలు, కీలక స్థావరాలు, పరిశ్రమలు కనిపించకుండా చేయడం వంటివి ఇందులో ఉంటాయి.పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్పై భారత్ ప్రతీకార దాడులు చేసే అవకాశాలు ఉన్నాయనే అంచనాలు నెలకొన్న వేళ.. కేంద్ర హెూంశాఖ ఇలాంటి ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. భారత్ దాడులకు పాక్ ప్రతిదాడికి దిగితే అందుకు ముందుగానే రాష్ట్రాలను సిద్ధం చేస్తున్నట్లు అర్థం అవుతోంది. ఒకవేళ పాక్ దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై అందర్నీ సన్నద్ధం చేసే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపింది.భారత్ తమపై ఏక్షణమైనా ప్రతీకార దాడి చేయొచ్చని, తాము అణ్వాయుధాలను సిద్ధం చేసుకున్నామని పాకిస్థాన్ నాయకులు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారు. మరేం జరగగనుందో చూడాలి.

# కమ్యూనికేషన్ రంగానికి మూలస్తంభం శాస్త్రవేత్త డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్




మానవ స్వరాన్ని ప్రపంచ దూరాలకు శబ్దంగా పరిచయం చేసిన సంఘటన విజ్ఞాన చరిత్రలో ఓ మైలురాయి. ఈ శబ్ద విప్లవానికి మార్గం వేసిన ఆవిష్కరణ మైక్రోఫోన్. శబ్దాన్ని విద్యుత్ సంకేతాలుగా మార్చే ఈ అద్భుత పరికరాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి చేసిన విజ్ఞాన శిల్పి డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్. ఆయన కమ్యూనికేషన్ రంగానికి మూలస్తంభంగా నిలిచిన శాస్త్రవేత్త. పేటెంట్ హక్కుల ఊహలకు అతీతంగా, పరిశ్రమలకు తన ఆవిష్కరణలు ఉచితంగా అందించాలన్న ఉదారత ఆయనను విశ్వ విజ్ఞాన మాధ్యమాల్లో చిరస్మరణీయుడిగా నిలిపింది.

1831 మే 16న బ్రిటన్లో జన్మించిన డేవిడ్ హ్యూస్ చిన్ననాటి నుంచే సంగీతంపై మక్కువ చూపించాడు. పియానో, మాండలిన్ వాయిద్యాల్లో ప్రావీణ్యం సాధించిన అతను, శబ్ద తరంగాల స్వభావంపై ఆసక్తితో శాస్త్రీయ అధ్యయనానికి పయనమయ్యాడు. 1838లో కుటుంబంతో కలిసి అమెరికాకు వలస వెళ్లిన హ్యూస్, కెంటుకీలోని సెయింట్ జోసెఫ్స్ కళాశాలలో సంగీత ప్రొఫెసర్గా స్థిరపడ్డాడు. అయితే సంగీతంలోని శబ్దతత్వం ఆయనను ఎలక్ట్రిక్ విజ్ఞాన ప్రక్రియల వైపు ఆకర్షించింది. 1855లో అభివృద్ధి చేసిన టైప్-ప్రింటింగ్ టెలిగ్రాఫ్ పరికరం హ్యూస్కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది. టెలిగ్రాఫ్ ద్వారా వచ్చిన సంకేతాలను తక్షణమే అక్షరాలుగా ముద్రించ గలిగే ఈ పరికరం కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పుకు కారణమైంది. ఇది ఫ్రాన్స్, ఇటలీ, రష్యా వంటి దేశాలలో అధికారికంగా ఉపయోగించ బడింది. 1878లో హ్యూస్ రూపొందించిన కార్బన్ మైక్రోఫోన్ ఆధునిక టెలిఫోన్ వ్యవస్థకు మౌలిక పునాదిగా నిలిచింది. శబ్ద తరంగాలను విద్యుత్ ప్రవాహ మార్పులుగా మార్చే ఈ పరికరం, మానవ స్వరాన్ని కిలోమీటర్ల దూరానికీ పంపించ గలిగే సామర్థ్యం కలిగింది. ఆసక్తికరమైనది ఏమంటే, హ్యూస్ తన మైక్రోఫోన్ ఆవిష్కరణకు పేటెంట్ దాఖలు చేయలేదు. శాస్త్రీయ విజ్ఞానాన్ని వ్యక్తిగత లాభానికి ఉపయోగించకుండా, సమాజానికి అందించిన ఉదారత ఆయన గొప్పతనానికి నిదర్శనం.

వైర్లెస్ కమ్యూనికేషన్ పై కూడా హ్యూస్ విశేష ప్రయోగాలు నిర్వహించాడు. 1879లో 500 గజాల దూరానికి వైర్లెస్ సంకేతాలను ప్రసారం చేయగలిగిన ఆయన, హర్ట్స్, మార్కోని కంటే ముందే రేడియో తరంగాలను ప్రయోగాత్మకంగా అన్వేషించాడు. కానీ, ఈ పరిశోధనలకు తగినంత శాస్త్రీయ ప్రామాణికత అందలేదన్న కారణంతో, ఆ కీర్తి ఆయనకు దక్కలేదు. అయినా ఆయన అభివృద్ధి చేసిన ఇండక్షన్ బ్యాలెన్స్ పరికరం ఆధారంగా భవిష్యత్తులో మెటల్ డిటెక్టర్లు రూపొందించ బడ్డాయి. తన ఆవిష్కరణలకు గుర్తింపుగా హ్యూస్ 1880లో బ్రిటన్ రాయల్ సొసైటీ ఫెలోగా ఎంపికయ్యాడు. 1885లో రాయల్ మెడల్తో సత్కరించ బడ్డాడు. ఫ్రాంక్లిన్ ఇనిస్టిట్యూట్ సహా అనేక అంతర్జాతీయ శాస్త్రీయ సంస్థల నుంచి గౌరవాలు అందుకున్నాడు. అయినప్పటికీ, శాస్త్రానికి సేవ చేయాలన్న లక్ష్యం ఒక్కటే ఆయన్ని నడిపించింది.

1900 జనవరి 22న హ్యూస్ లండన్లో పరమ పదించాడు. ఆయన సాధించిన విజ్ఞాన పునాదులు టెలి కమ్యూనికేషన్, రేడియో, టెలివిజన్, మైక్రోఫోన్, డిజిటల్ ఆడియో వ్యవస్థల్లో నేటికీ ప్రాణంగా కొనసాగు తున్నాయి. శబ్దాన్ని విద్యుత్ భాషలో మార్చిన ఆయన సృష్టి, మానవ సంభాషణలకి సుదూర సంబంధాలే కాదు %-% సమాజానికి శాశ్వతమైన శబ్ద సంబంధాన్ని అందించిందని చెప్పడంలో సందేహమే లేదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

పాఠకుల లేఖలు




## ముఖచిత్ర కథనం

రాబోయే కాలంలో హైడ్రోజన్ శక్తి ఉపయోగడిత ఉరించి వివరణాత్మంగా ఆదివారం ఆనుబంధంలో ప్రచురించినందుకు ధన్యవాఆదాలు తెలియని ఎన్నో విషయాలు తెలిపారు. సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. సందర్భానుసారంగా మీ కథనాలు బాగున్నాయి. ఇదే పంథా కొనసాగించండి.

**– ఎలకల రవికుమార్, విశాఖపట్నం**

**– లింగమనేని రాజేష్, అనపర్లి**

**–వాడపల్లి గణేష్ కుమార్ హైదరాబాద్**

**–చినవీరభద్రుడు కణపాక, హైదరాబాద్**

## సినిమా రివ్యూలు

వారం వారం విడుదలవుతున్న సినిమాలపై మీ విశ్లేషణ బాగుంది. ధన్యవాదాలు. ఓటిటి సినిమాలపై కూడా విశ్లేషణ చేయటం హర్షణీయం.

**–కస్తూరి శివరావు, విజయవాడ**

## బుడత బాగున్నాడు

చిన్నారి ప్రపంచంలా ప్రచురిత మవుతున్న బుడత పేజీలో చిన్నారులకు వుపయుక్తంగా రచయితలు రాస్తున్న కథలు బాగున్నాయి. అలాగే పజిల్స్ విజ్ఞాన వంతంగా ఉన్నాయి. తెలుగువారి శతకాలు, పద్యాలు అప్పుడప్పుడు మిస్ అవుతున్నాం. తప్పక ప్రచురించండి

**–కోరుట్ల రమాదేవి, తెనాలి**

**–మక్కామల పద్మావతి, హైదరాబాద్**

నవసాహిత్యం

## యుద్ధ 'నానీ'లు

చంపడం
మా ఉద్దేశ్యం కాదు
కానీజి
ప్రతీకారం
తీర్చుకోవడం మా
కర్తవ్యం.
నుదిటిన
సింధూరం నువ్వు
తుడిచేస్తేనేం
వీరుల
రక్తంతో వీర తిలకం
దిద్దుతాము.
భారతం
నేర్పలేదా?
స్త్రీ తలచుకుంటే
మరో కురుక్షేత్రమని.
సైనికాజిరక్తం
చిందిందని బాధపడకు
అదే
భరత మాతకు
సింధూరం.
ప్రత్యక్షంగా
పోరాడు
మా వీరుల
ప్రతాపం ఏంటో
తెలుస్తుంది.
ఎంత కాలం
దొంగ దెబ్బ తీస్తావు?
మా ఎదురు దెబ్బ
రుచి చూడు.
ఆయుధం
ఉందని విర్ర వీగకు
నీ ఆయుధం
పవిత్ర యుద్ధం
చేయలేదు.
వెంట్రుకవాసిలో
ప్రమాదం తప్పిందనా?
తప్పించింది
మేమే.
మీరు
మనుషులు అయితే
మతం పేరిట
మారణకాండ
సృష్టించరు.
తల్లికి
బిడ్డలంటే ఎంత ప్రేమో
భరత మాతకి
వీరసైనికులు కూడా
అంతే.
వీరులపై
మీ ప్రతాపం క్షమిస్తాం
సామాన్యుల పై మీ
ప్రతాపం
తల తీస్తాం.
సామాన్యులజి
మీదకు గన్ లు ఎత్తకు
నీ బుల్లెట్లకు
చింతకాయలు రాలవు.
ఒకసారి హింసిస్తే
సరే
మళ్ళీ మళ్ళీ
తప్పదు తప్పులేదు ఈ
సింధూరం
పవిత్ర యుద్ధం పేరుతో
మోసమా!
అయితే కాచుకో
మా కురుక్షేత్ర యుద్ధం.
దేవుడు ఉన్నాడు
అనడం
తప్పా?
మరీజి
మీ దేవుడెందుకు
మాకు.

**కర్నె మల్లికార్జున్,**
**6303744239.**


## నీలాకాశపు చత్రం


నీలాకాశపు చత్రం క్రింద
నేల తల్లిని నమ్ముకుని జీవించే
నిజమైన శ్రమజీవి రైతు.
నమ్మకమనే మంత్రాన్ని జపిస్తూ
నడి సంద్రంలో నావ పయనంలా
నిరీక్షిస్తాడు మంచి ఫలితానికై.
నలుదిక్కులా నగ్నంగా కనిపించే ప్రకృతిని
నాటిన ప్రతి విత్తూ మొలకెత్తాలని
నిత్యం నీరాజనాలు పలుకుతాడు.


నాగరికత ముసుగులో
నాలుగుగోడల మధ్య బందీలయ్యే
నగరజీవిలా కాకుండా...
నిండు చూలాలులా ఉండే పంటపొలాలను,
నరుల నిజాయితీని శంకించకుండా
నేత్రాలతోనే రక్షించు కుంటాడు !
నెత్తుటిని శ్రమ' దానం' గా వినియోగిస్తూ
నట్టింటికి నవ ధాన్యాలు చేరుస్తాడు !

నమ్మకద్రోహపు విధానాలెన్ని వున్నా
నీరుకారిపోకుండా
నిత్యాన్న పథకాలకు
నైవేద్యం వడ్డిస్తాడు ప్రతి రైతు
నరుల ఆహారానికై.
నిజమైన నేస్తానికి
నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తున్న కర్షకులకు
నమస్సుమాంజలులు.

**ఎ.సి.నాథ్.**
**9290434551.**




ఫన్‌చ్
నారు

సూర్య
www.suryaa.com
18.5.2025
ఆదివారం అనుబంధం

# బుడత



## బాలల కథ

### చిరునవ్వు శక్తి

రాము అనే అబ్బాయి తన గ్రామంలో చాలా సంతోషంగా ఉండేవాడు. అతని చిరునవ్వు ఎప్పుడూ ముఖం మీద ఉండేది. ఆ గ్రామంలో అందరూ రాముని చాలా ఇష్టపడేవారు. కానీ, ఆ గ్రామంలో కనక శాస్త్రి అనే ఒక ముసలాయన ఉండేవాడు. అతను ఎప్పుడూ కోపంగా ఉండేవాడు. పిల్లలంటే అతనికి చిరాకు. అందరూ అతన్ని "ముఖం చూడకూడని మనిషి" అని పిలిచేవారు.

ఒక రోజు, రాము తన స్నేహితులతో బంతి ఆడుతూ ఉండగా, ఆ బంతి కనక శాస్త్రి ఇంటిలోకి దూరిపోయింది. అందరూ భయపడి పరుగులు తీశారు. కానీ రాము మాత్రం ధైర్యంగా కనక శాస్త్రి ఇంటి వైపు నడిచాడు.

"అయ్యా, మా బంతి మీ ఇంట్లోకి వచ్చింది. దయచేసి తిరిగి ఇస్తారా?" అని రాము అడిగాడు.

కనక శాస్త్రి కోపంతో వచ్చి, "ఎవరు నువ్వు? నా ఇంట్లోకి రావడానికి సాహసిస్తున్నావా?, వెళ్ళిపో!" అని అరిచాడు.

రాము భయపడలేదు. అతను కేవలం చిరునవ్వుతో, "క్షమించండి అయ్యా. మేము జాగ్రత్తగా ఆడుకుంటాము. మా బంతి దయచేసి ఇస్తారా?" అని మళ్ళీ అడిగాడు.

కనక శాస్త్రి ఆ చిరునవ్వు చూసి ఆశ్చర్యపోయాడు. ఎవరూ అతనితో అలా మాట్లాడరు. అతను లోపలికి వెళ్ళి బంతిని తెచ్చి రాముకి ఇచ్చాడు.

"ఇంకొకసారి ఇలా జరగకుండా చూసుకో," అని కనక శాస్త్రి అన్నాడు, కానీ అతని స్వరంలో కోపం లేదు.


రాము "ధన్యవాదాలు అయ్యా!" అని చెప్పి, ఒక మంచి చిరునవ్వుని అతనికి బహుమతిగా ఇచ్చాడు.

అది మొదలు, రాము ప్రతిరోజూ కనక శాస్త్రిని చూడటానికి వెళ్ళేవాడు. అతనికి నమస్కారం చేసి, తన చిరునవ్వును అతనితో పంచుకునేవాడు. కొన్నాళ్ళకి, కనక శాస్త్రి మొఖంలో కూడా చిన్న చిరునవ్వు కనిపించటం మొదలైంది.

ఒక రోజు, రాము చాలా దుఃఖంగా కూర్చుని ఉన్నాడు. అతని తాత చనిపోయారని విని కనక శాస్త్రి రాము దగ్గరకి వచ్చాడు. అతను రాముని ఓదార్చాడు, కథలు చెప్పాడు. రాము దుఃఖాన్ని తగ్గించడానికి ప్రయత్నించాడు.

గ్రామంలో అందరూ ఆశ్చర్యపోయారు. కనక శాస్త్రి ఇప్పుడు ఒక మారిపోయిన వ్యక్తి. ఆయన మొఖంలో ఎప్పుడూ చిరునవ్వు కనిపిస్తూ ఉంది. పిల్లలతో ఆడుకుంటున్నాడు, కథలు చెప్తున్నాడు.

గ్రామంలో ఒక పెద్ద పండుగ వచ్చింది. అందరూ కనక శాస్త్రిని



పెద్దగా గౌరవించారు. ఆయనని పండుగకి ముఖ్య అతిథిగా పిలిచారు.

కనక శాస్త్రి అందరి ముందు నిలబడి, "నేను చాలా కోపిష్టిగా ఉండేవాడిని. నా హృదయం చాలా కఠినంగా మారిపోయింది. కానీ ఒక చిన్న అబ్బాయి చిరునవ్వు నా జీవితాన్ని మార్చింది. రాము నాకు నేర్పిన పాఠం – ఒక చిరునవ్వు కష్టమైన హృదయాన్ని కూడా కరిగించగలదు," అని చెప్పాడు.

రాము సిగ్గుపడుతూ నవ్వాడు.


ఆ రోజు నుండి, ఆ గ్రామంలో అందరూ ఒకరికొకరు చిరునవ్వులను బహుమతిగా ఇవ్వడం మొదలుపెట్టారు. కనక శాస్త్రి గ్రామంలోని పిల్లలందరికీ కథలు చెప్పేవాడు.


"చిరునవ్వు ఒక అద్భుతమైన బహుమతి. దానిని ఎవరితోనైనా పంచుకోవచ్చు, అది ఎప్పుడూ తగ్గిపోదు," అని కనక శాస్త్రి చెప్పేవాడు.

"చిరునవ్వుతే, ప్రపంచం నీతో నవ్వుతుంది
పూర్ణచంద్రుడిలా చీకటి మేఘాల మధ్య నుండి
తొంగిచూసేటప్పుడు, ఎవరైనా చిరునవ్వు నవ్వినప్పుడు అది పరిసరాలన్నింటినీ సమ్యమైన కాంతితో నింపుతుందిటీ అలాంటి గొప్ప చిరునవ్వు 'భరోసా నవ్వు'గా భావించవచ్చు.
ఆ భరోసా చిరునవ్వు స్పష్టమైన చూపుతో, నాకు నిర్మలమైన దృష్టాంతాన్నిస్తుంది మరియు అది వారి అద్భుతమైన స్వభావానికి కొలమానంగా పనిచేస్తుంది!"

మండా వెంకట అప్పారావు
,(9347589272)






## వేమన శతకం

తన విరక్తి యనెడి దాసి చేతను జిక్కి
మిగిలి వెడలవేక మిణుకుచున్న
నరుడి కేడముక్తి వరలెడి చెప్పడీ
విశ్వదాభిరామ వినుర వేమ! ॥ 2 ॥

ఆదివారం అనుబంధం
సూర్య
www.suryaa.com
18.5.2025

## మూత్రాశయ క్యాన్సర్ మరియు పొగాకు వాడకం

# భారతదేశంలోతలెత్తుతున్న నిశ్శబ్ద ప్రజారోగ్య సంక్షోభం

(డాక్టర్ బొప్పన సాయి మాధురి, కన్సల్టెంట్, మెడికల్ ఆంకాలజిస్ట్, హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్-విజయవాడ)



ఊహించని రోగ నిర్ధారణ

ఇది తరచుగా చిన్నదిగానే అనిపించే దానితో ప్రారంభమవుతుంది – మూత్రంలో కొద్ది మె-ుత్తంలో రక్తం, అకస్మాత్తుగా టాయిలెట్‌కు వెళ్లాల్సిన అవసరం లేదా రాత్రిపూట చాలాసార్లు టాయిలెట్‌కు వెళ్లడం. చాలా మంది రోగులు ఈ లక్షణాలను సాధారణ అసౌకర్యంగా లేదా వయస్సు సంబంధిత బలహీనతగా భావించి వాటిని విస్మరిస్తారు. దురదృష్టవశాత్తు, కొంతమందికి, తుది రోగ నిర్ధారణ జీవితాన్ని మార్చేస్తుంది: అదే మూత్రాశయ క్యాన్సర్.

పొగాకు మరియు మూత్రాశయం మధ్య సంబంధం పొగాకు వాడకం సాధారణంగా ఊపిరితిత్తుల మరియు నోటి క్యాన్సర్‌లతో ముడిపడి ఉంటుంది. అయితే, పొగాకు వాడకం – ధూమపానం మరియు నమలడం రెండూ – మూత్ర వ్యవస్థను ఎంత తీవ్రంగా ప్రభావితం చేస్తాయో కొద్దిమందికి మాత్రమే తెలుసు. పొగాకులో కనిపించే సమ్మేళనాలు శరీరం రక్తప్రవాహం ద్వారా ప్రాసెస్ చేయబడతాయి. చివరికి, మూత్రపిండాలు ఈ విషాలను ఫిల్టర్ చేసి మూత్రం రూపంలో మూత్రంలో జమ చేస్తాయి. అక్కడ అవి ఎక్కువ కాలం మూత్రాశయ లైనింగ్‌తో సంబంధంలో ఉంటాయి. దీని ఫలితంగా, కాలక్రమేణా, మూత్రాశయం యొక్క సున్నితమైన కణజాలాలు దెబ్బతింటాయి, ఉత్పరివర్తనలు, క్యాన్సర్ అభివృద్ధి చెందుతాయి.

భయంకరమైన వాస్తవం ఏమిటంటే, ధూమపానం ఊపిరితిత్తుల వ్యాధికి సంబంధించిన సంబంధం గురించి ప్రజలను హెచ్చరించడంలో మనం కొంత పురోగతి సాధించినప్పటికీ, మూత్రాశయ ఆరోగ్యానికి, ధూమ పానానికి మధ్య సంబంధాన్ని ఇప్పటికీ పెద్దగా పట్టించుకోలేదు. దురదృష్టవశాత్తు, పొగాకు వాడకం వల్ల కలిగే ప్రభావాలు ఆ అలవాటు మానేసిన తర్వాత కూడా అలాగే ఉంటాయి. సంవత్సరాల తరబడి పొగాకు వాడకం వల్ల శాశ్వతంగా మారే కణ మార్పులు సంభవిస్తాయి. భారతదేశంలో చాలా మంది పొగాకును నమలడం వల్ల "తక్కువ హానికరం" అవుతుందని మరియు పొగ తాగడం మానేయడం అనేది అప్పటి వరకు కలిగిన నష్టాన్ని తిప్పికొడుతుందనే తప్పుడు భావనను నమ్ముతున్నారు. సరైన అవగాహన లేకపోవడం ప్రాణాలను బలిగొంటోంది.

సూచికలు, మూత్రంలో రక్తం కొద్దిగా, అప్పుడప్పుడు కనిపించడం లేదా తేలికపాటి మంట వంటి లక్షణాలు సాధారణ మూత్రాశయ ఇన్ఫెక్షన్లు లేదా వయస్సు సంబంధిత ప్రోస్టేట్ రుగ్మతలను పోలి ఉంటాయి కాబట్టి, వైద్య సహాయం కోరే వ్యక్తులను ఆశ్చర్యపరచవు. మహిళలు తప్పుగా నిర్ధారణ చేయబడే అవకాశం ఉంది. ఈ లక్షణాలు యూటీఐ కారణంగా అని పొరబడే వీలుంది. లక్షణాలు నిలకడగా వృద్ధి చెంది, సమస్య కలిగించే సమయానికి, క్యాన్సర్ సాధారణంగా ముదిరిన దశకు చేరుకుంటుంది.

**ఇది ఎందుకు రాబోయే ప్రజారోగ్య సంక్షోభం?**

పొగాకు వినియోగం మన సమాజంలో లోతుగా పాతుకుపోయిందిబీ చిన్న పట్టణాల్లో పాన్ దుకాణాల వద్ద, నగరాల్లో హైఎండ్ స్మోకింగ్‌లో దీన్ని చూడవచ్చు. వివిధ తరాల్లో, సామాజిక ఆర్థిక నేపథ్యాలలో కూడా ఇది సమానంగా ప్రతిబింబిస్తుంది. అయినప్పటికీ, ప్రచారాలు నోటి క్యాన్సర్, గుండె జబ్బులను ప్రస్తావించినప్పటికీ, పొగాకు వాడకంపై ప్రజారోగ్య చర్చలో మూత్రాశయ క్యాన్సర్ చాలా అరుదుగా ప్రస్తావించబడుతోంది.

మూత్ర సంబంధిత లక్షణాలు సాధారణంగా క్యాన్సర్‌తో సంబంధం కలిగి ఉండవు మరియు ప్రమాద హెచ్చరికలను విస్మరిస్తారు కాబట్టి ఈ సమస్య చాలా ముఖ్యమైనది. ప్రజలు యూరాలజిస్ట్‌ను సంప్రదించే ముందు స్పెషలిస్టు కాని వైద్యులను కూడా సందర్శిస్తారు. అప్పటికి, విలువైన సమయం వృధా అవుతుంది.

మూత్రాశయ క్యాన్సర్ భావోద్వేగాలను కలిగిస్తుంది. ఆర్థిక పరిస్థితులను, కుటుంబ వనరులను హరిస్తుంది. చికిత్స ఎంపికలలో శస్త్రచికిత్స, నెలవారీ తనిఖీలు మరియు జీవితాంతం పర్యవేక్షణ ఉంటాయి.

**దాని గురించి మనం ఏమి చేయగలం?**

మనం అవగాహనతో ప్రారంభించి ప్రతిచర్య నుండి నివారణ వైపు దృష్టికోణాన్ని మార్చుకోవాలి.

ఒక దేశంగా, మనం మూత్ర లక్షణాల గురించి మరింత బహిరంగంగా చర్చించడం ప్రారంభించాలి – వైద్య కేంద్రా లలో మాత్రమే కాదు, ఇళ్ళు, పాఠశాలలు, కార్యాలయాలలో కూడా. ధూమపానం ఊపిరితిత్తులకు మాత్రమే కాకుండా, ఇతర ముఖ్యమైన అవయవాలకు కూడా హానికరం అని యువతకు అవగాహన కల్పించాలి.

వైద్యులు, ముఖ్యంగా జనరల్ ప్రాక్టీషనర్లు, వివరించలేని మూత్ర లక్షణాలు ఉన్న రోగులలో, ముఖ్యంగా పొగాకు వాడకం చరిత్ర ఉన్న రోగులలో, మూత్రాశయ క్యాన్సర్‌ను పరిశోధించడానికి క్రమం తప్పకుండా మూత్ర పరీక్ష లేదా అల్ట్రాసౌండ్‌ను సిఫార్సు చేయాలి. అదేవిధంగా, ప్రజలు తమ సొంత శరీరాలపై శ్రద్ధ వహించడానికి ప్రోత్సహించాలి. మీ మూత్రంలో రక్తం కనిపిస్తే, అంచనాలు వేసుకోకండి. వైద్య సలహా తీసుకోండి. పది నిమిషాల చెక్-అప్ మీకు సంవత్సరాల నొప్పిని కాపాడుతుంది.

**మద్దతు వ్యవస్థల పనితీరు**


మూత్రాశయ క్యాన్సర్ అనేది శారీరక వ్యాధి కంటే ఎక్కువబీ ఇది ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంది. చాలా మంది రోగులు, ముఖ్యంగా శస్త్రచికిత్స అవసరమయ్యేవారు లేదా మూత్ర విసర్జనలో శాశ్వత మార్పులను ఎదుర్కొంటున్నవారు, భావోద్వేగపరంగా ఇబ్బంది పడుతున్నారు. భారతదేశంలో, క్యాన్సర్ సంబంధిత అంశాలపై ఇప్పటికీ అపోహలున్నాయి. ఇది ఒంటరితనానికి దారితీయవచ్చు. పునరావాస ప్రక్రియలో సహాయక బృందాలు, కౌన్సెలింగ్ మరియు పేషెంట్ ఎడ్యుకేషన్ చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. కుటుంబాలను కూడా ఈ ప్రక్రియలో చేర్చుకోవాలిబీ సంరక్షకులుగా మాత్రమే కాకుండా, వారి ప్రియమైనవారికి ఛాంపియన్లుగా కూడా ఉండాలి. మూత్రాశయ క్యాన్సర్ అసాధారణం కాదు. ఇది హానిచేయని ప్రవర్తనగా కనిపించే దాని నుండి పుట్టువచ్చుబీ భోజనం తర్వాత బీడీ తాగడం, పని చేసే చోట గుట్కా తినడం లేదా టైమ్ పాస్‌కు సిగరెట్ తాగడం వంటివి. కాలక్రమేణా, ఈ చర్యలు పెద్ద ఎత్తున వృద్ధి చెందుతాయి – అందుకుమూల్యం తరచుగా నిశ్శబ్దంగా చెల్లించబడుతుంది. అయితే, పరిస్థితి ఇలానే ఉండనవసరం లేదు. తగిన అవగాహన, ముందస్తు స్క్రీనింగ్, మూత్ర సంబంధిత ఆరోగ్యాన్ని గట్టిగా పట్టించుకోవాలనే నిబద్ధతతో, మనం ఈ వ్యాధి గమనాన్ని మార్చగలం.

## శివుని వాహనమైన నంది గర్భాలయానికి ఎదురుగా ఎందుకు వుంటాడు?

మనం సాధారణంగా నంది విగ్రహాన్ని శివుని గర్భాలయంలో శివలింగానికి ఎదురుగా వుండడం చూస్తూ వుంటాం కదా..నిజానికి నంది శివుని రాకకోసం లేదా అతని మాటకోసం ఎదురుచూస్తూ ఎదురుగా లేడు. అతడు కేవలం ఎదురు చూస్తూన్నాడంతే. నంది నిరీక్షణకు చిహ్నం. మన భారత ధర్మంలో నిరీక్షణ అనేది అత్యుత్తమ ధర్మాలలో ఒకటిగా భావింపబడుతున్నది. నంది దేనికోసమో ఆశించి ఎదురు చూడటం లేదు. అతనిది ఏ కోరికా లేని ఎదురుచూపు. నిజాయితీ, దక్షత వంటి గొప్ప లక్షణాలు కలిగియున్నవాడు నంది. అందుకే అతడు శివునికి అత్యంత సాన్నిహిత్యుడయ్యాడు. నందిలో వున్న గొప్ప స్వీకార తత్వమది. మనమంతా ఆలయానికి వెళ్లాక నందిలా వుండాలి. అనగా ఎటువంటి కోరికా లేని స్థితిలో కేవలం ఆ పరమాత్మకై నిరీక్షణ అనే తపనలో తదేకంగా వుండగలగాలి. దానికి స్థిర తత్వాన్ని ఆపాదించాలి. నిజానికి వృషభుడు మనకు అదే చెబుతున్నాడు. మీరు కంగారుగా ఇక్కడ కూడా కదలాడకండి. ఇది ఆ పరమాత్మ స్థావరం. ప్రశాంత చిత్తంతో నాలా కూర్చోండి. అన్నీ అదిగో ఎదురుగా వున్న ఆ భోలా శంకరుడు చూసుకుంటాడు అని.

ముందు మనం ఎటువంటి కంగారు లేదా కలుషిత ఆలోచనలకు లోనుకాకుండా వుండాలని అతడు మనకు చెబుతున్నాడు.

సాధారణంగా ప్రార్ధన కంటే ధ్యానం ఉత్కృష్టమైనది. ఎందుకంటే మనం దేవునితో మాట్లాడటానికి ప్రయత్నించే మార్గం ప్రార్ధన. కాని ధ్యానం ద్వారా భగవంతుడే మనతో మాట్లాడుతాడు. నందీశ్వరుడు మనకదే చెబుతున్నాడు. ముందు వినడానికి ఆసక్తి కనబరచండి. దానికి తగ్గ ఓర్పును సమకూర్చుకోండి. అలాగే నిరీక్షణలోనే మోక్షసాధన వుందని గమనించండి. అయితే ఇక్కడ నంది కూర్చొనే విధానం కేవలం కూర్చోవడం కాదు. అతను చాలా చురుకైన భంగిమలో కూర్చుని వున్నాడు. అవసరమైతే



అతడు లేచి నిలబడతాడు. ముష్కరులను పడగొడతాడు. అంతేకాని అందులో నిద్రగాని సుఖం గాని లేవు. కేవలం అప్రమత్తతతో కూడిన నిరీక్షణ మాత్రమే..

శివుని నంది వాహనం ఎన్ని విషయాలు మనకు నిగూడంగా చెబుతున్నదో చూశారా..!

నిజానికి పరికించి చూడాలే గాని భారతీయ ఆధ్యాత్మిక శక్తిలో అంతః విశేషాలు అనంతం. అర్ధం చేసుకుంటే పరమానందదాయకం.

రాజస్థాన్లోని సో మోర్పూర్ రాజ సంస్థానానికి చెందిన యువరాజు అవిరాజ్ (ఇషాన్ కట్టర్). అమ్మమ్మ సాసీ (జీనత్ ఆమన్), తల్లి పద్మజ (సాక్షి తన్వర్), సోదరుడు డిగ్గి (విహాన్ సమత్), సోదరి జిన్నీ (కావ్య ట్రెహాన్)తో కలిసి విలాసవంతంగా జీవిస్తుంటారు. అయితే ఊహించని విధంగా రాజ పరివారంలో ఆర్థిక సమస్యలు తీవ్రంగా తలెత్తుతాయి. దాంతో తాము ఉండే రాయల్ ప్యాలెస్ను ఫైవ్ స్టార్ హోటల్కు అద్దెగా ఇవ్వాలని నిర్ణయించుకొంటారు. ఈ నేపథ్యంలో ఫైవ్ స్టార్ హోటల్ సీఈవో సోఫియా కన్మని శేఖర్ (భూమీ పడ్నేకర్) రాజ పరివారంలోకి అడుగుపెడుతుంది.

మోర్పూర్ సంస్థానంలో అవిరాజ్ ఫ్యామిలీకి ఆర్థిక సమస్యలు ఎలాంటి కష్టాలను తెచ్చిపెట్టాయి? ప్యాలెస్ను ఫైవ్ స్టార్ హోటల్గా మార్చడానికి కుటుంబ ఎలాంటి తర్జనభర్జన పడింది? అవిరాజ్కు సోఫియా ఎలా దగ్గరైంది? సోఫియాకు తన సహ ఉద్యోగి కునాల్ (ఉదిత్ అరోరా)తో బ్రేకప్ ఎందుకు అయింది? అవిరాజ్తో సోఫియా రొమాన్స్ ఎలా సాగింది? రాజ కుటుంబానికి ఎదురైన ఆర్థిక సమస్యలకు పరిష్కారం లభించిందా? అనే ప్రశ్నలకు సమాధానమే ది రాయల్స్ వెబ్ సిరీస్ కథ. ది రాయల్స్ వెబ్ సిరీస్ కథ విషయానికి వస్తే.. సింపుల్గానే ఉంటుంది. విలాసవంతంగా బతికే రాజ కుటుంబం ఆర్థిక కష్టాల్లో పడటం, వాటి వల్ల వారి జీవితాలపై ఎలాంటి ప్రభావం పడింది? కష్టాల్లోను రాజ కుటుంబీకులు ఎలాంటి దర్పాన్ని చూపించే ప్రయత్నం చేశారనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఇలాంటి సబ్జెక్టోకి రొమాంటిక్ కంటెంట్ను బలవంతంగా జొప్పించి.. ఆ స్టోరీలో ఉండే ఇంటెన్సిటీని దెబ్బ తీశారనిపిస్తుంది. చివరకు రొమాంటిక్ లవ్ స్టోరీనా? ఎమోషనల్ రాయల్ ఫ్యామిలీ కథనా? అనే విషయంపై పూర్తిగా గందరగోళం ఏర్పడుతుంది. అవిరాజ్, సోఫియా మధ్య ఉండే రొమాన్స్ పూర్తిగా ఆర్టిఫిషియల్గానే కనిపిస్తుంది.

కథలో ఎమోషన్స్కు స్కోప్ ఉన్నప్పటికీ.. ఆ దిశగా దృష్టిపెట్టలేదనే విషయం తొలి రెండు ఎపిసోడ్స్లోనే తేలిపోతుంది. మిగితా 6 ఎపిసోడ్స్ సాగదీసి సహనానికి పరీక్ష పెట్టేలా ఉంటుంది. అయితే క్లైమాక్స్ బలహీనంగా ఉండటం వల్ల అంతగా ఆకట్టుకోలేకపోతుంది. వెబ్ సిరీస్ చూసిన తర్వాత అందులో బలమైన పాయింట్ ఏమిటనే విషయం ఎట్టి పరిస్థితుల్లోను బోధపడదనిపిస్తుంది. నటీనటుల విషయానికి వస్తే.. అవిరాజ్గా ఇషాన్ కట్టర్ పెర్ఫార్మెన్స్ చూస్తే.. గొప్పగా, ఇంపాక్ట్ఫుల్గా ఉండదు. ఆరు ముద్దులు, మూడు కౌగిలింతల క్యారెక్టర్లో కనిపించాడు. భూమీ పడ్నేకర్ను ముద్దులు పెట్టుకోవడమో లేదా.. అర్ధనగ్నంగా గుర్రమెక్కి గోల్ఫ్ ఆడుకోవడమో చేస్తుంటాడు. ఇక భూమి పడ్నేకర్ పాత్ర ఈ వెబ్ సిరీస్లో లీడ్ తీసుకొన్నట్టు కనిపిస్తుంది. కానీ ఆ పాత్రలో కూడా బలం లేకపోవడంతో రొమాన్స్ కోసమే ఆ క్యారెక్టర్ను డిజైన్ చేశారా? అనే అనుమానం వస్తుంది.




చాలా రోజుల తర్వాత జీనత్ ఆమన్ తెరపైన కనిపించింది. కానీ ఆమె టాలెంట్ను పూర్తిగా వృథా చేయడంతోపాటు గాలికి వదిలేసినట్టు కనిపిస్తుంది. సాక్షి తన్వర్ పర్వాలేదనిపిస్తుంది. నోరా ఫతేహి, డినో మారియా, చంకీ పాండే, మిలింద్ సోమన్ నామమాత్రంగానే మిగిలిపోయారు. మిగితా నటీనటులు సాదాసీదా పాత్రల్లోనే మిగిలిపోయారు. రొమాంటిక్ కామెడీగా రూపొందిన ఈ వెబ్ సిరీస్లో గొప్పగా కంటెంట్ లేకపోవడం నిరాశ పరిచే అంశం. ఆర్టిఫిషియల్ రొమాన్స్, కామెడీ చూస్తే.. స్క్రిప్టు పరంగా అత్యంత బలహీనంగా కనిపిస్తుంది. కానీ ప్రొడక్షన్ వాల్యూస్, నటీనటుల ఎంపిక చాలా బాగుంది. వీటిపై భారీగా కసర్తత్తు చేసిన టీమ్.. కంటెంట్ను పట్టించకోలేదని విషయం స్పష్టంగా కనిపిస్తుంది. గ్రాండియర్ లుక్, విజువల్ బ్యూటీ, కెమెరా వర్క్ ఆకట్టుకొనేలా ఉంటాయి. ఇషాన్, భూమీ రొమాన్స్ చూద్దామనుకొనే వారు ఎలాంటి అంచనాల లేకుండా.. బోర్ కొట్టినప్పుడు ఫాస్ట్ ఫార్వర్డ్లో స్కిప్ చేస్తూ ఈ వెబ్ సిరీస్ను ముగించేయ వచ్చు.

జ

---

పారామౌంట్ పిక్చర్స్, స్కై డ్యాన్స్ టీసీ ప్రోడక్షన్స్ బ్యానర్పై టామ్ క్రూజ్, క్రిస్టోఫర్ మెక్క్వారీలు సంయుక్తంగా ఈ మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకనింగ్ చిత్రాన్ని దాదాపు 400 మిలియన్ల బడ్జెట్తో (భారత కరెన్సీలో రూ. 3,400 కోట్లు) తెరకెక్కించారు. ఈ సినిమాకు ఫ్రాసెర్ టాగ్గార్ట్ సినిమాటోగ్రాఫర్గా సేవలందించగా.. మ్యాక్స్ అరుజ్, అల్ఫీ గాడ్రేలు సంగీత సారథ్యం వహించారు. ప్రమీయర్ షో తర్వత ఈ సినిమా గురించి నెటిజన్లు సోషల్ మీడియాలో వెల్లడించిన రివ్యూలు, అభిప్రాయాలు ఎలా ఉన్నాయంటే? మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రికోనింగ్ ఆల్టైమ్ గ్రేటెస్ట్ యాక్షన్ మూవీస్లో ఒకటి.. టెన్షన్, స్టంట్స్, దర్శకత్వం, ఎడిటింగ్ అన్ని బోర్డర్ దాటేశాయని ఓ యూజర్ కామెంట్ పెట్టాడు. టామ్ క్రూజ్ మరోసారి దిగ్గజ నటుడినని అనిపించుకున్నాడు, నిర్మాణ విలువలు చూస్తుంటేనే పిచ్చెక్కుతుంది. మిషన్ ఇంపాజిబుల్ ఫ్రాంచైజీలో వచ్చిన అన్ని సినిమాలను ఖచ్చితంగా ఇది దాటేస్తుందని అతను రాసుకొచ్చాడు. టామ్ క్రూజ్ మూకి 24 గంటల్లో రికార్డు ఫస్ట్ మినిట్ నుంచి లాస్ట్ సెకండ్ వరకు మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకనింగ్ మైండ్ బ్లోయింగ్గా ఉంది, ప్రతిది పర్ఫెక్ట్గా ఉంది. యాక్షన్ అల్టిమేట్, సస్పెన్స్ పీక్స్, బ్యాక్గ్రౌండ్ స్కోర్ సూపర్. టామ్ క్రూజ్కు మరో ఐకానిక్ సినిమా, అందరూ చూడండని ఓ ట్విట్టర్ యూజర్ పోస్ట్ పెట్టాడు.

మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకనింగ్తో ఈ ఫ్రాంచైజీకి సంతృప్తికరమైన ముగింపు పలికారు. ఈథన్ హంట్ ఎదుర్కొన్న అనుభవాలు, అతని నినాదంపై ఎన్నో జ్ఞాపకాలున్నాయి. టామ్ క్రూజ్ 30 ఏళ్ల క్రితం ఎలా ఉండేవాడో ఇప్పటికీ అలాగే స్టంట్స్ ఇరగదీశాడు. ఎన్నో అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయి. కానీ నాకు థర్డ్ యాక్ట్ చాలా ఇష్టమని ఇక్కడి వరకు చేరుకోవడానికి చాలా కాలం పట్టింది.. టామ్ క్రూజ్ ఈ ఫ్రాంచైజీ కోసం ఏళ్లుగా పడ్డ కష్టాన్ని ఆరాధించకుండా ఉండలేమని ఓ నెటిజన్ రాసుకొచ్చాడు.

నిన్న రాత్రి ముందుగానే మిషన్ ఇంపాజిబుల్ – ది ఫైనల్ రెకనింగ్ స్క్రీనింగ్ వీక్షించగలిగా.. ఫస్ట్ హాఫ్ కంటే సెకండాఫ్ చాలా బాగుంది, ముఖ్యంగా ప్లేన్ సీన్ పిచ్చెక్కించింది. మిషన్ ఇంపాజిబుల్ ఫ్రాంచైజీలో ఇది బెస్ట్ మూవీ కాదు.. కానీ వీడ్కోలు చెప్పడానికి పర్లేదని ఓ యూజర్ కామెంట్ చేశాడు.

నాకు మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకనింగ్ బాగా నచ్చింది. అద్భుతమైన సినిమాల ఫ్రాంచైజీకి ఇది సరైన ముగింపు. నా వైపు నుంచి థంబ్స్ అప్ ఇదిగో అంటూ ఓ అమ్మాయి రివ్యూ ఇచ్చింది మిషన్




ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకనింగ్ గురించి చాలా ఫస్ట్ రివ్యూలు నిరాశపరిచాయని, ఇప్పటికీ బిగ్ స్క్రీన్పై యాక్షన్ కోసమే వెతుకుతున్నానని జర్మనీ నుంచి ఓ టామ్ క్రూజ్ అభిమాని కామెంట్ చేశాడు. మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకనింగ్ ప్యూర్ సినిమా. ఇది ఖచ్చితంగా ఆల్టైమ్ గ్రేటెస్ట్ యాక్షన్ సినిమాగా నిలిచిపోతుంది. బిగినింగ్ నుంచి ఎండింగ్ వరకు ప్రతి సీన్ హృదయాన్ని కదిలించేలా, థ్రిల్ కలిగించేలా సీన్స్ ఉన్నాయని ఓ యూజర్ కామెంట్ చేశాడు.

---

బ్యాంకులో ఉద్యోగాలు చేసే విజయ్ (శ్రీ విష్ణు), అరవింద్ (వెన్నెల కిషోర్) క్లోజ్ ఫ్రెండ్స్. స్కూల్ లైఫ్ నుంచి అమ్మాయిలకు ప్రపోజ్ చేసినా ప్రయత్నాలు ఫలించావు. జీవితంలో లవర్స్, పార్ట్నర్స్ లేకుండా సింగిల్గానే గడుపుతుంటారు. అలాంటి పరిస్థితుల్లో పూర్వ (కేతిక శర్మ) అనే అమ్మాయిని చూసి విజయ్ వెంటపడుతాడు. కానీ విజయ్ను ప్రేమించిన హరిణి ( ఇవానా) అతడి లవ్ కోసం వెంటపడుతుంది. ఇదిలా ఉంటే.. గాయత్రి అనే అమ్మాయితో అరవింద్ కూడా ప్రేమలో పడుతాడు.

పూర్వ, హరిణి మధ్య విజయ్ ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నాడు? తన వెంట పడుతున్న విజయ్ ప్రపోజల్కు పూర్వ ఎలా రియాక్ట్ అయింది? తన వెనుక పడుతున్న హరిణితో విజయ్ ఎలాంటి రియాక్షన్ ఇచ్చాడు? ఈ ట్రాయాంగిల్ లవ్ గేమ్లో ఎవరి ప్రేమను విజయ్ దక్కించుకొన్నాడు? సింగిల్ ట్యాగ్ నుంచి విజయ్, అరవింద్ ఎవరితోనైనా మింగిల్ అయ్యారా? జీవితంలో ఒక్క అమ్మాయితోనైనా ప్రేమలో పడాలనే లక్ష్యాన్ని విజయ్, అరవింద్ చేధించారా? అనే ప్రశ్నలకు ఫన్తో ఇచ్చిన సమాధానాలే సింగిల్ సినిమా కథ. ఒక అమ్మాయి కోసం ఓ యువకుడు ప్రయత్నిస్తుంటే.. మరో అమ్మాయి ఆ యువకుడి వెంటపడటం అనే పాయింట్ చాలా రొటీన్, రెగ్యులర్ పాయింట్గానే కనిపిస్తుంది. కానీ దర్శకుడు కార్తీక్ రాజు ఈ పాయింట్కు ఇచ్చిన ట్రీట్మెంట్, రాసుకొన్న సన్నివేశాలు, అనుసరించిన స్క్రీన్ ప్లే ఈ సినిమాకు బలంగా నిలిచాయి. శ్రీ విష్ణు, వెన్నెల కిషోర్ పాత్రల ద్వారా పండించిన వన్ లైనర్ డైలాగ్స్, పంచ్ డైలాగ్స్ చాలా చోట్ల బ్రహ్మాండంగా పేలాయి. సన్నివేశాలు అలా పరుగులు పెడుతుంటాయి. కానీ కథలో మాత్రం ఎలాంటి కదలిక లేకపోవడం కొంత టెస్టింగ్ టైమ్లానే ఉంటుంది. అయితే అలాంటి ఫీలింగ్ నుంచి సెకండాఫ్లో మూర్తి (రాజేంద్ర ప్రసాద్) క్యారెక్టర్ను తెరపైకి తెచ్చి ఎమోషనల్ కంటెంట్ను జొప్పించడంతో కథలో కొద్దిగా చలనం కనిపిస్తుంది. ఇక చివర్లో యంగ్ హీరో, హీరోయిన్ల గెస్ట్ అప్పీయరెన్స్తో స్టోరీలో జోష్ పుట్టించడం కొంత రిలీఫ్గా ఉంటుంది. చివరి 15 నిమిషాలు రొటీన్ ముగింపు లేకుండా డిఫరెంట్ టచ్తో ముగించడం సినిమాకు కొత్తదనాన్ని తీసుకొచ్చారని చెప్పవచ్చు




ఇటీవల కాలంలో విభిన్న కథ, విలక్షణమైన పాత్రలతో విజయాలు సాధిస్తున్న శ్రీ విష్ణు మరోసారి డిఫరెంట్ క్యారెక్టర్లో చెలరేగిపోయాడు. తన బాడీ లాంగ్వేజ్కు తగినట్టుగా రాసిన సన్నివేశాల్లో మస్తుగా ఫన్ క్రియేట్ చేశాడు. శ్రీ విష్ణుకు వెన్నెల కిషోర్ తోడవ్వడంతో మరింత కామెడీ పండింది. సినిమాలో ఈ ఇద్దరు పోటాపోటీగా పంచ్ డైలాగ్స్ వేస్తూ సీన్లను వినోదభరితంగా మార్చారు. ఇక కేతిక శర్మ, ఇవానాకు ఫెర్ఫార్మెన్స్కు స్కోప్ ఉన్న పాత్రలు లభించడంతో వారు కూడా గ్లామర్తోపాటు యాక్టింగ్ కూడా బాగా చేశారు. కేతిక గ్లామర్తో ఆకట్టుకొంటే.. ఇవానా అదనంగా ఎమోషనల్గా ఆకట్టుకొన్నది. ఇక వీటీవీ గణేష్ కూడా తనదైన హాస్యాన్ని పండించాడు. రాజేంద్ర ప్రసాద్ మరోసారి భావోద్వేగమైన పాత్రలో గుర్తుండిపోయే పాత్రలో కనిపించారు.

సింగిల్ సినిమాకు సంబంధించి టెక్నికల్ విషయాల్లోకి వెళితే.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫి ప్లస్ పాయింట్స్. విశాల్ చంద్రశేఖర్ అందించిన పాటలు పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ కామెడీ సీన్లకు చేసిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చక్కగా కుదిరింది. వెల్ రాజ్ చిత్రీకరించిన సీన్లు, వాటికి వాడుకొన్న కలర్ ప్యాటర్న్ కారణంగా సన్నివేశాలు బ్యూటిఫుల్గా కనిపించాయి. ప్రవీణ్ ఎడిటింగ్, ఆర్ట్స్ వర్క్ విభాగాల పనితీరు బాగున్నాయి. విద్యా కొప్పినీడు, భాను ప్రతాప్, రియాజ్ చౌదరీ అనుసరించిన నిర్మాణ విలువలు బాగున్నాయి. ఓవరాల్గా సింగిల్ గురించి చెప్పాలంటే.. ఫుల్లుగా కామెడీ, కొంత ఎమోషనల్గా సాగే ట్రాయంగిల్ లవ్ స్టోరి. శ్రీ విష్ణు, వెన్నెల కిషోర్ చేసిన ఫన్ హంగామా, ఇవానా, కేతిక శర్మ గ్లామర్ ఈ సినిమాకు ప్లస్ పాయింట్స్. కథ లేకుండా కామెడీ, స్క్రీన్ ప్లేపైనే ఆధారపడటం మైనస్గా అనిపిస్తాయి. థియేటర్లో కూర్చొనంత సేపు సరదా, కడుపుబ్బ నవ్వించే సన్నివేశాలు ఉంటాయి. బయటకు వచ్చాక చెప్పుకోవడానికి గొప్పగా ఏ అంశాలు ఉండవు. ఫన్, కామెడీ, లవ్ అంశాలతో ఉండే సినిమాలను ఇష్టపడే వారికి, ముఖ్యంగా యూత్కు ఫుల్ మీల్సా ఉంటుంది. ఎక్కువగా అంచనాలు వేసుకోకుండా వెళితే.. మంచి ఎంటర్టైనర్ చూశామనే ఫీలింగ్ కలుగుతుంది. ఈ ఫన్ రైడ్ను థియేటర్లోనే ఎంజాయ్ చేయండి..



# టెలికాం ప్రగతి యాత్ర

## మనిషి సమాచార దాహం తీర్చిన అద్భుత ప్రయాణం!

**మానవ నాగరికత పురోగమనంలో సమాచారం ఒక కీలకమైన శక్తి. నేటి ప్రపంచాన్ని సమాచార సాంకేతికత శాసిస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒకప్పుడు పావురాలతో, ఆ తర్వాత ఉత్తరాలతో సమాచారం పంచుకున్న మనం టెలికాం రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులతో ప్రపంచాన్ని అరచేతిలో చూస్తున్నాం. ఈ అద్భుతమైన ప్రయాణాన్ని ఒక్కసారి గుర్తు చేసుకుందాం !**

మానవ నాగరికత పురోగమనంలో సమాచారం ఒక కీలకమైన శక్తి. నేటి ప్రపంచాన్ని సమాచార సాంకేతికత శాసిస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒకప్పుడు పావురాలతో, ఆ తర్వాత ఉత్తరాలతో సమాచారం పంచుకున్న మనం టెలికాం రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులతో ప్రపంచాన్ని అరచేతిలో చూస్తున్నాం. ఈ అద్భుతమైన ప్రయాణాన్ని ఒక్కసారి గుర్తు చేసుకుందాం !

1837లో శామ్యూల్ మోర్స్ టెలిగ్రాఫ్ను కనిపెట్టడంతో సుదూర ప్రాంతాలకు సమాచారం చేరవేయడానికి ఒక కొత్త శకం మొదలైంది. మోర్స్ కోడ్ ద్వారా విద్యుత్ సంకేతాలను ప్రసారం చేయడం ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్కు నాంది పలికింది. ఇదే రేడియో కమ్యూనికేషన్కు పునాది వేసింది.

ఆ తర్వాత 1876లో అలెగ్జాండర్ గ్రాహం బెల్ టెలిఫోన్ను కనుగొనడంతో మనుషులు నేరుగా మాట్లాడుకునే అవకాశం వచ్చింది. 1969లో ఇంటర్నెట్కు పూర్వగామి అయిన అర్పానెట్ పరిశోధనల కోసం కంప్యూటర్లను అనుసంధానించడానికి ఏర్పాటైంది. 1973లో మార్టిన్ కూపర్ మొబైల్ ఫోన్ కాల్ను




పరిచయం చేయడంతో కమ్యూనికేషన్ మరింత వ్యక్తిగతమైంది. 70వ దశకంలో మొబైల్ ఫోన్లు అందుబాటులోకి రావడం ఒక సంచలనం. 1990లో టిమ్ బెర్నర్స్-లీ వరల్డ్ వైడ్ వెబ్ను కనుగొనడంతో ఇంటర్నెట్ సామాన్యులకు సైతం చేరువైంది. 2004లో ఫేస్బుక్ ప్రారంభించబడటం సోషల్ మీడియా కమ్యూనికేషన్ యుగానికి దారితీసింది. 2007 తర్వాత స్మార్ట్ఫోన్ల ఆవిష్కరణ వైర్లెస్ కమ్యూనికేషన్ను మరింత వ్యక్తిగతం చేసింది. అదే ఏడాది ఆపిల్ ఐఫోన్ను విడుదల చేయడంతో కమ్యూనికేషన్, కంప్యూటింగ్, వినోదం ఒకే పరికరంలో అందుబాటులోకి వచ్చాయి. నేడు కృత్రిమ మేధస్సు, వర్చువల్ రియాలిటీ వంటి అత్యాధునిక సాంకేతికతలు సమాచార సాంకేతిక భవిష్యత్తును మరింతగా మారుస్తున్నాయి. సాంకేతికతలు వేగంగా అభివృద్ధి చెందుతుండటంతో 21వ శతాబ్దపు కమ్యూనికేషన్ గతంలో ఎన్నడూ లేనంతగా విస్తరించింది.

**ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవం – డిజిటల్ సమానత్వం కోసం ఒక పిలుపు:**

ప్రతి సంవత్సరం మే 17న మనం ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవాన్ని జరుపుకుంటాం. 1865 మే 17న ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ స్థాపన జ్ఞాపకార్థం ఈ రోజును పాటిస్తున్నాం. ఇంటర్నెట్, కొత్త టెక్నాలజీ తీసుకువచ్చిన సామాజిక మార్పులపై అవగాహన పెంచడం, ప్రాంతాల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించడం ఈ రోజు యొక్క ముఖ్య లక్ష్యాలు. 2025 ఇతివృత్తంగా 'డిజిటల్ పరివర్తనలో లింగ సమానత్వం' తీసుకోవడం జరిగింది. ఇంటర్నెట్, డిజిటల్ పరికరాల ప్రాప్యత, స్థోమతలో అంతరాలు, పరిమిత డిజిటల్ నైపుణ్యాల వల్ల నేటి ఆర్థిక వ్యవస్థలో రేపటి డిజిటల్ పరిష్కారాలను రూపొందించడంలో మహిళలు, బాలికల భాగస్వామ్యం పరిమితమవుతోంది. ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణ, స్థిరమైన అభివృద్ధికి కొత్త మార్గాలను తెరవడానికి ఈ అంతరాన్ని తగ్గించడం చాలా అవసరం అని ఈ థీమ్ తెలియజేస్తుంది.

సూర్య
www.suryaa.com
18.5.2025



## ఇండియాలో టెలికాం అభివృద్ధి – ఒక శక్తివంతమైన నెట్వర్క్:

ప్రపంచ దేశాలలో చైనా తర్వాత 69.2 కోట్ల చందాదారులతో అతిపెద్ద టెలికమ్యూనికేషన్ నెట్వర్క్ కలిగిన రెండవ దేశం మన భారతదేశం. 2025 మార్చి 11న ట్రాయ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2024 డిసెంబర్ 31 నాటికి మన దేశంలో 118.992 కోట్ల మంది ఫోన్ సౌకర్యం కలిగి ఉన్నారు. వీరిలో పట్టణ ప్రాంతాల్లో 66.337 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 52.656 కోట్లు ఉన్నారు. దేశవ్యాప్తంగా బ్రాడ్బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్షన్ల విషయానికి వస్తే, వైర్డ్ కనెక్షన్లు 4.119 కోట్లు, వైర్లెస్ కనెక్షన్లు 90.378 కోట్లతో కలిపి మొత్తం 94.496 కోట్ల బ్రాడ్బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో జియో 50.43%, ఎయిర్టెల్ 30.62%, వొడాఫోన్ ఐడియా 13.37%, బిఎస్ఎన్ఎల్ 3.74%, యెట్రియా 0.24%, ఇతరులు 1.60% మార్కెట్ వాటాను కలిగి ఉన్నారు. 2024 డిసెంబర్ చివరి నాటికి దేశంలో టెలిసాంద్రత 84.45%గా నమోదైంది.

## గత వైభవం – టెలికాం ప్రస్థానం మన దేశంలో:

ఒకసారి మనం గతంలోకి తొంగి చూస్తే, ప్రొఫెసర్ యస్ పి చక్రవర్తి గారిని భారతీయ ఎలక్ట్రానిక్స్ టెలికమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ పితామహుడిగా చెప్పుకుంటాం. స్వాతంత్ర్యం రాకముందే టెలిగ్రాఫ్ పరిచయంతో మనదేశంలో టెలికమ్యూనికేషన్స్ ప్రారంభమయ్యాయి. 1850లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కలకత్తా, డైమండ్ హార్బర్ మధ్య మొదటి ప్రయోగాత్మక విద్యుత్ టెలిగ్రాఫ్ లైన్ను తమ ఉపయోగం కోసం ప్రారంభించింది. 1873లో బొంబాయి, కలకత్తా మధ్య డ్యూప్లెక్స్ టెలిగ్రాఫీని ప్రవేశపెట్టారు. 1881లో ఇంగ్లాండ్కు చెందిన ఓరియంటల్ టెలిఫోన్ కంపెనీ లిమిటెడ్ కలకత్తా, బొంబాయి, మద్రాస్, అహ్మదాబాద్లలో టెలిఫోన్ ఎక్స్ఛేంజీలను తెరవడం ద్వారా దేశంలో మొదటి అధికారిక టెలిఫోన్ సేవలను ప్రారంభించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 1948 నాటికి దేశం మొత్తం మీద కేవలం 80 వేల టెలిఫోన్ కనెక్షన్లు మాత్రమే ఉన్నాయి. 1971 నాటికి ఈ సంఖ్య 9.80 లక్షలకు చేరుకుంది. 80వ దశకంలో దేశీయ సమాచార ప్రసారాల కోసం మొదటి భూఉపగ్రహ స్టేషన్ను సోవియట్ యూనియన్ సహకారంతో సికింద్రాబాద్లో ట్రోపోస్కాటర్ సిస్టమ్ లింక్ ప్రారంభించబడింది.

## సరళీకరణ – సంస్కరణల ఊతం:

1981లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ టెలికాం రంగంలో సరళీకరణ తీసుకురావడానికి ప్రయత్నించినా, కొన్ని రాజకీయ కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. 1991 వచ్చేసరికి దేశంలో 50.7 లక్షల టెలిఫోన్లు ఉన్నాయి. కానీ, 90వ దశకంలో పి.వి. నరసింహారావు గారి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలతో ఈ రంగం ఒక్కసారిగా ఊపందుకుంది. 1994లో వచ్చిన నేషనల్ టెలికమ్యూనికేషన్స్ పాలసీతో దేశంలోని అన్ని గ్రామాలకు టెలికమ్యూనికేషన్ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. 1997లో అప్పటి ప్రభుత్వం ట్రాయ్ను ఏర్పాటు చేయడంతో విధాన రూపకల్పనలో, సుంకాలు నిర్ణయించడంలో ప్రభుత్వ జోక్యం తగ్గింది. 1995లో వాణిజ్యేతర ప్రాతిపదికన మొదటి మొబైల్ టెలిఫోన్ సేవను, పబ్లిక్ కమర్షియల్ ఇంటర్నెట్ సదుపాయాన్ని టాటా కమ్యూనికేషన్స్ ప్రారంభించింది. ఆ తర్వాత వచ్చిన సాంకేతిక మార్పులతో 2జి, 3జి, 4జి, 5జి లతో మనం దూసుకుపోతున్నాం. ఇప్పుడు ఆరవ తరం కోసం పరిశోధనలు జరుగుతున్నాయి.

సాంకేతికతలు వేగంగా అభివృద్ధి చెందుతున్నందున 21వ శతాబ్దపు కమ్యూనికేషన్ గతంలో ఎన్నడూ లేనంతగా విస్తరించింది.

## సామాజిక ఆర్థికాభివృద్ధికి టెలికాం వారధి:

టెలికమ్యూనికేషన్ భారతదేశ సామాజిక ఆర్థికాభివృద్ధికి ఎంతో మద్దతునిచ్చింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న డిజిటల్ అంతరాన్ని కొంతవరకు తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషించింది. భారతదేశంలో ఈ-గవర్నెన్స్ను ప్రవేశపెట్టడం ద్వారా పాలనలో పారదర్శకతను పెంచడానికి కూడా ఇది సహాయపడింది. అంతేకాకుండా, భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం సామూహిక విద్యా కార్యక్రమాలను అందించడానికి ప్రభుత్వం ఆధునిక టెలికమ్యూనికేషన్ సౌకర్యాలను సమర్థవంతంగా ఉపయోగించింది. టెలికాం రంగంలో మనం సాధించిన ఈ అద్భుతమైన ప్రగతిని కొనసాగిస్తూ, డిజిటల్ సమానత్వం సాధించే దిశగా మరింత కృషి చేద్దాం!

**జనక మోహన రావు దుంగ – 8247045230**

# మోఢేరా సూర్య దేవాలయం

గజనీ మహ్మద్ రహస్యం ఈ ఆలయంలో ఉంది ..

భారతీయ సంస్కృతిని ఆవిష్కరించే ప్రధాన కేంద్రాలు మన ఆలయాలు ,క్షేత్రాలు ,తీర్థాలు . వేల సవ్వరాలుగా ప్రకృతి వైపరీత్యాలను ,పరమతస్తుల దాడులను తట్టుకొని భారతీయ శిల్పకళా వైభవాన్ని,నాటి నిర్మాణ శైలిని ప్రపంచానికి చాటి చెబుతూ కాల పరీక్షకు ఎదురొడ్డి నిలిచి తమ ఉనికిని నిలబెట్టుకున్న ఆలయాలు ఎన్నో ఉన్నాయి ఈ పుణ్యభూమిలో .అలాంటి ఆలయమే ఇప్పుడు మనం చూడబోయే ఆలయం . భారతదేశంలోని మూడు ప్రసిద్ధ సూర్య దేవాలయాల గురించి మాత్రమె మనకు తెలుసుఅవే కోణార్క్ ఆలయం , మార్తాండ్ ఆలయం, అరసవెల్లిఆలయం .చరిత్ర మరుగున పడిపోయిన నాల్గవ ప్రాచీన సూర్యదేవాలయం గురించి మనం తెలుసుకోబోతున్నాం.భారత నిర్మాణ సైలినే కాదు ఒక రహస్యాన్ని కూడా తనలో దాచుకొని చరిత్రకారులకు అందించిన ఈ ఆలయమే మోడేరా సూర్య దేవాలయం.క్రీస్తుపూర్వం సోలంకి చక్రవర్తులు పునర్నిర్మించినట్టు చెబుతున్న ఈ ఆలయం గుజరాత్ లో ఉంది .అహ్మదాబాద్ కి వంద కిలోమీటర్ల దూరంలో పుష్పవతి నది వడ్డున ఉన్న ఈ ఆలయ ప్రస్తావన బ్రహ్మ ,స్కాంద పురాణాలలో ఉంది. ఈ ఆలయ నిర్మాణం ఎప్పుడు జరిగిందన్నది తెలీదు కానీ క్రీ.పూ. 1022, 1063లో సోలంకి చక్రవర్తి భీమ్ దేవ్ సోలంకి ఈ ఆలయాన్ని పునరుద్ధరించాడని చరిత్ర ద్వారా తెలుస్తోంది.స్కాందపు, బ్రహ్మ పురాణాలననుసరించి ప్రాచీనకాలంలో మోఢేరా చుట్టుపక్కల వున్న ప్రాంతాలను ధర్మరన్య అని పిలిచేవారని తెలుస్తోంది.త్రేతా యుగంలో శ్రీరాముడు రావణున్ని సంహరించిన తరువాత బ్రహ్మహత్యా పాపం నుంచి బయటపడేందుకు తగిన మార్గం సూచించమని కులగురువైన వశిష్టుడ్ని అడిగాడని అప్పుడు వశిష్ట మహర్షి ధర్మరన్య వెళ్ళమని శ్రీరామచంద్రుడికి సలహా ఇచ్చాడని .రాముడు విడిది చేసి తమ కులదైవం సూర్యుడికి పూజ చేసి ఇక్కడొక ఆలయం నిర్మించాడని ఆ ధర్మారణ్య ప్రాంతమే ఇప్పుడు మోఢేరా అనే పేరుతో పిలవబడుతోందని చెబుతారు. అహిల్వాడ్ పాటణ్ ని రాజధానిగా చేసుకొని ఈ ప్రాంతాన్ని సోలంకి చక్రవర్తులు పరిపాలిస్తుండే వారు సూర్య వంశస్తులైన సోలంకీలు మోడేరాలో ఉన్న సూర్యదేవాలయాన్ని ఎంతో పవిత్రంగా చూసుకునేవారు .తమ కులదేవతగా సూర్యుణ్ణి ఆరాధిస్తూ నిత్య పూజాదికాలు నిర్వహించేవారు . క్రీ.పూ. 1025, 1026 ప్రాంతంలో సోమనాథ్ తో పాటు చుట్టుపక్కల వున్న ప్రాంతాలను విదేశీ ఆక్రమణదారుడైన మహమ్మద్ గజినీ తన ఆధీనంలోకి తీసుకున్నట్టు ఆ దేవాలయంలోని గర్భగుడిలో ఒక గోడపై లిఖించబడి వుంది. గజనీ ఆ ప్రాంతాలను ఆక్రమించుకోవడంతో సోలంకీలు కూడా తమ పూర్వవైభవాన్ని కోల్పోయారు.సోలంకి సామ్రాజ్యానికి రాజధానిగా చెప్పుకునే ' అహిల్వాడ్ పాటణ్ ' కూడా తన గొప్పతనాన్ని, వైభవాన్ని పూర్తిగా కోల్పోనారంభించింది.తమ పూర్వవైభవాన్ని కాపాడుకునేందుకు సోలంకి రాజ కుటుంబం మరియువర్తకులు ఓ జట్టుగా ఏర్పడి ఈ ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తమ ఆరాధ్య దైవమైన సూర్యుడ్ని కొలిచేందుకు అందమైన ఈ సూర్య దేవాలయాన్ని పునర్నిర్మించుకున్నట్టు చరిత్ర ద్వారా తెలుస్తోంది .భారతదేశంలోని కోణార్క్ ఆలయం , మార్తాండ్ ఆలయం, అరసవెల్లి అనే మూడు ప్రసిద్ధ సూర్య దేవాలయాల గురించి మాత్రమె మనకు తెలుసు .చరిత్ర మరుగున పడిపోయిన నాల్గవ ప్రాచీన సూర్యదేవాలయమే ఇప్పుడు మనం చెప్పుకుంటున్న గుజరాత్లోని మోఢేరాలో ఉన్న సూర్య దేవాలయం శిల్పకళలకు కాణాచి అయిన ఈ ఆలయంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన ప్రత్యేకత ఒకటుంది. అదేమిటంటే ఈ ఆలయ నిర్మాణంలో ఎక్కడా సున్నం ఉపయోగించకపోవటం .ఇరానీ శిల్పకళా శైలిలో రెండు



భాగాలుగా ఈ ఆలయాన్ని నిర్మించారు.ఇందులో తొలి భాగం గర్భగుడి కాగా, రెండవది సభామండపం,గర్భగుడి మందిర లోపల పొడవు 51అడుగుల 9అంగుళాలు.అలాగే వెడల్పు 25అడుగుల 8అంగుళాలుగా నిర్మించారు.మందిరంలోని సభామండపంలో మొత్తం 52స్తంభాలు వున్నాయి. ఈ స్తంభాలపై అత్యద్భుతమైన కళాఖండాలు,పలు దేవతల చిత్రాలను చెక్కారు.రామాయణం, మహాభారతంలోని ప్రధాన ఘట్టాలను ఇక్కడ మలిచారు.స్తంభాల కింది భాగం అష్ట కోణాకారంలోను, పైభాగం గుండ్రంగా మలచబడి ఉన్నాయి .సూర్యోదయం జరిగిన వెంటనే తొలి సూర్యకిరణం ఆలయగర్భగుడిలోకి ప్రవేశించేలా ఆలయ నిర్మాణం చేపట్టారు.సభామంటపానికి ఎదురుగా విశాలమైన కొలను వుంది. దీన్ని సూర్యమదుగు లేదా రామ మదుగు అని పిలుస్తారు.అల్లావుద్దీన్ ఖిల్జీ ఈ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకునేసమయంలో సూర్యమందిరాన్ని పూర్తిగా ధ్వంసం చేసాడు.మందిరంలోని విగ్రహాలను తునాతునకలు చేసేసాడు.ప్రస్తుతం భారతీయ పురావస్తుశాఖ ఈ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తీసుకుని సంరక్షిస్తోంది.అహ్మదాబాద్ నుంచి ఈ ప్రాంతానికి చేరుకునేందుకు బస్సు మరియు టాక్సీల సౌకర్యం ఉంది. అహ్మదాబాద్ వరకు రైలు మార్గం గుండా వెళ్లవచ్చు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
18.5.2025

# మిధునరాశిలో గురు గ్రహ ప్రవేశం

# ద్వాదశ రాశుల వారిపై ప్రభావం

**మేషరాశి.... (అశ్విని 1 2 3 4,భరణి 1 2 3 4,కృతిక 1వ పాదం) (నామ నక్షత్రములు: చూ, చే ,చొ, లా,లీ, లూ, లే, లో,అ)**

మానసిక శాంతి మరియు సహకారం: గురువు మూడవ రాశి అయిన మిథునరాశిలోకి ప్రవేశిస్తాడు, మరియు అది శత్రు క్షేత్రం కాబట్టి, మానసిక శాంతి మరియు మంచి వ్యక్తులతో సహకారం తగ్గుతుంది. అవసరమైన సమయంలో కమ్యూనికేషన్ సమస్యలు తలెత్తుతాయి.భాగస్వామ్యాలు మరియు సంబంధాలు: భాగస్వామ్య విషయాలు మరియు సామాజిక స్నేహాలలో, ముఖ్యంగా జీవిత భాగస్వామితో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి, ఎందుకంటే అపార్థాలు అవకాశాలు సాధ్యమే వ్యక్తిగత వృద్ధి మరియు ఆరోగ్యం: మీ యోగ్యతను పెంచుకోవడానికి కృషి చేయండి మరియు మీ తండ్రి ఆరోగ్యం గురించి తగిన జాగ్రత్తలు తీసుకోండి.

విద్య మరియు సేవ: ఉన్నత విద్య, సామాజిక సేవ మరియు సంతృప్తికి సంబంధించిన విషయాలు సాధారణ ఫలితాలను ఇస్తాయి.

ఆర్థిక విషయాలు: ఎక్కువగా ఆశించిన లాభాలు అవసరానికి తగ్గట్టుగా రాకపోవచ్చు మరియు ఇబ్బందికరంగా ఉంటాయి.

**వృషభరాశి...(కృతిక 2,3,4,రోహిణి 1 2 3 4,మృగశిర 1 2 పాదాలు) (నామ నక్షత్రములు:ఈ, ఊ, ఎ, ఓ, వా, వీ, వూ, వె, వో)**

సంభాషణ సవాళ్లు: బృహస్పతి రెండవ గృహమైన మిథునరాశిలోకి ప్రవేశిస్తాడు, ఇది శత్రుఇల్లు కాబట్టి, మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. కొన్నిసార్లు, నిజాయితీగా మాట్లాడటం కూడా సమస్యలను కలిగిస్తుంది.

ఆర్థిక వివేకం: ఆర్థిక విషయాలలో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడం కష్టం. జాగ్రత్తగా ముందుకు వెళ్లాలి

ఆరోగ్యం మరియు అప్పులు: శత్రు, వ్యాధులు మరియు అప్పుల విషయాలలో జాగ్రత్తగా ఉండాలి. రోగనిరోధక శక్తిని పెంచుకోండి, సకాలంలో అప్పులు తీర్చండి మరియు ఇతరులను గెలవడానికి అధిక శ్రమ చేస్తారు.

ఆరోగ్య సంబంధిత విషయాలు: బృహస్పతి ఎనిమిదవ ఇల్లు, ధనుస్సును చూస్తున్నందున ఆరోగ్య సంబంధిత విషయాలు, ఆకస్మిక ఖర్చులు మరియు విమర్శలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

వృత్తి జీవితం: వృత్తిపరమైన విషయాలలో చాలా పని బాధ్యతలు ఉంటాయి, కానీ బృహస్పతి పదవ ఇల్లు, కుంభం వైపు చూస్తున్నందున గౌరవం పెరుగుతుంది.

**మిధున రాశి...(మృగశిర 3 4,ఆరుద్ర 1 2 3 4,పునర్వసు 1,2,3 పాదాలు) (నామ నక్షత్రములు: కా, కి, కూ, ఖం , జ్ఞ, చ్ఛ, కే, కో, హ, హి)**

ఆలోచనలు మరియు నిర్ణయం తీసుకోవడం: బృహస్పతి శత్రు ఇంట్లో ఉ న్నందున, మీరు చేసే ఆలోచనలు మీకు హానికరం కావచ్చు. ప్రియమైనవారి సహకారంతో ఆలోచించడం మంచిది.

సామాజిక సంబంధాలు: సామాజిక సంబంధాలు మెరుగుపడతాయి మరియు ఆ సంబంధాల కారణంగా మీ కీర్తి మరియు గౌరవం పెరుగుతాయి.

మైత్రి బంధాలు ఉపయోగించడం: మీరు వాటిని స్నేహితుల కోసం ఉ పయోగిస్తే, అవి కొనసాగుతాయి. మీరు వాటిని మీ కోసం ఉపయోగిస్తే, అవి నష్టాన్ని కలిగిస్తాయి.


కుటుంబం మరియు ఆరోగ్యం: మీ తండ్రి ఆరోగ్యం లేదా మీ పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి. వారి అవసరాల కోసం ఎక్కువ ఖర్చు చేయడం మంచిది.

**కర్కాటక రాశి...(పునర్వసు 4, పుష్యమి 1 2 3 4, ఆశ్లేష 1 2 3 4 పాదాలు) (నామ నక్షత్రములు: హి, హూ, హే, హొ, డా, డీ ,డూ, డే, డో)**

ఖర్చు మరియు విభేదాలు: ఆధ్యాత్మిక ఖర్చులు మరియు మంచి కార్యక్రమాల కోసం ఖర్చు చేసే అవకాశం ఉంది, కానీ అనవసరమైన ఖర్చులు మరియు విభేదాలు పెరుగుతాయి. జాగ్రత్తగా ఉండండి.

వాహనం మరియు గృహ: వాహనం మరియు గృహ సంబంధిత విషయాలపై ఎక్కువ ఖర్చు చేయడం వల్ల ఆశించిన ఆనందం లేకపోవచ్చు.

శత్రువులు మరియు నైపుణ్యాలు: శత్రువుల వల్ల ఇబ్బందులను ఎదుర్కోవడం వల్ల మీరు వాటిని అధిగమించడానికి ప్రయత్నాలు చేస్తున్నప్పుడు మీ నైపుణ్యాలు పెరుగుతాయి.



ఆరోగ్యం మరియు ఖర్చులు: ఆరోగ్యం మరియు ,ముఖ్యమైన వ్యక్తులు సమస్యలపై ఎక్కువ ఖర్చు చేసే అవకాశం.

జాగ్రత్తలు: గురు సంబంధిత లోపాలను నివారించడానికి చర్యలు తీసుకోండి.

**సింహరాశి...(మఖ 1 2 3 4, పుబ్బ 1 2 3 4, ఉత్తర 1వ పాదం) (నామ నక్షత్రములు: మా, మీ, మూ, మే, మో, టా, టీ, టూ, టే)**

వృత్తిపరమైన జీవితం: శత్రు క్షేత్రంలో బృహస్పతి సంచారము మీరు శత్రువులతో పోటీ పడటానికి మరియు లాభాలను సంపాదించడానికి కష్టపడి పనిచేయడానికి వీలు కల్పిస్తుంది, కానీ ప్రయోజనాలు ఆ ప్రయత్నానికి విలువైనవి కాకపోవచ్చు.

ప్రయాణం మరియు సహకారం: తరచుగా స్వల్ప దూర ప్రయాణాలు మరియు ఇతరుల నుండి కావలసిన స్థాయిలో సహకారం ఆశించవచ్చు.

పిల్లలు మరియు ఖర్చులు: పిల్లలకు సంబంధించిన ఖర్చులు మరియు అనుకోని విషయాలలో నష్టాలు సాధ్యమే.

సామాజిక జీవితం: సమాజంలో కొత్త పరిచయస్తులను ఆశించవచ్చు, కానీ వ్యాపార వ్యవహారాల్లో జాగ్రత్త అవసరం.

**కన్యా రాశి...(ఉత్తరఫల్గుణి 2 3 4,హస్త 4,చిత్త 1 2 పాదాలు) (నామ నక్షత్రములు: టో,పా,పి,పూ,షం,ణా,పే,పో)**

వృత్తిపరమైన సవాళ్లు: గురువు పదవ ఇంట్లో శత్రు క్షేత్రంలోకి ప్రవేశించడం వల్ల వృత్తిలో అననుకూలతలు మరియు గౌరవం కోల్పోవడం విషయంలో తగిన విధంగా జాగ్రత్తలు అవసరం.

సంభాషణ: అననుకూలతలు మరియు అపార్థాలు తలెత్తవచ్చు, కాబట్టి తక్కువగా మాట్లాడటం మంచిది.

విద్య మరియు స్నేహితులు: స్నేహితుల ద్వారా విద్యలో సానుకూల ఫలితాలు సాధించవచ్చు.

శత్రువులు మరియు విజయం: మీరు శత్రువులపై విజయం సాధించడానికి కష్టపడి పనిచేస్తారు మరియు గొప్ప ప్రయత్నంతో మీ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటారు.

**తులా రాశి...(చిత్త 3 4,స్వాతి 1 2 3 4, విశాఖ 1 2 3 పాదాలు) (నామ నక్షత్రములు: రా, రి, రూ, రె, రో, తా, తీ, తూ, తే)**

కుటుంబం మరియు ఆరోగ్యం: శత్రు క్షేత్రంలో తొమ్మిదవ ఇంట్లో బృహస్పతి స్థానం కారణంగా మీ తండ్రి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోండి.

ప్రవర్తన దిద్దుబాటు: మీ ప్రవర్తన మీకు హానికరంగా ఉండవచ్చుబీ సమస్యలను నివారించడానికి దాన్ని సరిదిద్దండి.

సహకారం మరియు అసంతృప్తి: మంచి సహకారం ఆశించబడుతుంది, కానీ అది ఉపయోగకరంగా ఉండకపోవచ్చు, అసంతృప్తికి దారితీస్తుంది.

విద్య మరియు ప్రయత్నాలు: కుటుంబంలో ఉన్నత విద్య కోసం ప్రయత్నాలను, కృషి పెంచుకోండి.

అసంతృప్తిని అధిగమించడం: తండ్రి, పెద్దలు మొదలైన వారి సహకారంతో అసంతృప్తిని అధిగమించడానికి మీ యోగ్యత శక్తిని పెంచుకోండి.

**వృశ్చిక రాశి...(విశాఖ 4,అనురాధ 1 2 3 4, జేష్ఠ 1 2 3 పాదాలు) (నామ నక్షత్రములు: తో, నా, నీ, నూ, నె, నో, యా, యీ, యు)**

ఖ్యాతి మరియు ఖర్చులు: ఆకస్మిక ఖర్చులు మరియు ఇతరులకు సహాయం చేయడం వల్ల పెద్దమనిషిగా మంచి పేరు వస్తుంది.

కుటుంబ ఖర్చులు: కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా పిల్లలకు అభివృద్ధి మరియు ఆరోగ్య ఖర్చులు ఎక్కువగా ఉంటాయి.

ఊహించని ఖర్చులు: ఊహించని ఖర్చులు ఇబ్బందికరంగా ఉండవచ్చు.

సంభాషణ మరియు పురోగతి: చర్చలు మరియు మీ మాటను నిలబెట్టుకోవడం కొంతవరకు మీరు ముందుకు సాగడానికి సహాయపడుతుంది.

కొనుగోళ్లలో జాగ్రత్త: మోసపోకుండా ఉండటానికి గృహోపకరణాలు లేదా వాహనాలను కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉ ఒడండి.

ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం: చింతామణి గృహాంతస్థ శ్రీమన్నాగరనాయకుడిని జపించడం ప్రయోజనకరంగా ఉండవచ్చు.

**ధను రాశి...(మూల 1 2 3 4,పూర్వాషాఢ 1 2 3 4,ఉత్తరాషాఢ 1వ పాదం) (నామ నక్షత్రములు: యే, యో, భా,భీ, భూ, ధ, ఫ, డా, భే)**

సామాజిక సవాళ్లు: సామాజిక విషయాలలో కష్టాలు మరియు ఇబ్బందులను ఎదుర్కొంటారు, సాంఘిక సంబంధాల అపార్థాల వల్ల కొన్ని నష్టాలు సంభవిస్తాయి.

లాభం మరియు నష్టాలు: లాభం కోసం చేసే ప్రయత్నాలు నష్టాలకు దారితీయవచ్చు మరియు గౌరవాన్ని తగ్గించవచ్చు.

సహకారం లేకపోవడం: మీ చట్టపరమైన ప్రవర్తన ఉన్నప్పటికీ ఇతరులు మీతో సహకరించకపోవచ్చు, వారి స్వార్థం కారణంగా.

అసంతృప్తి మరియు దూరం: ఇతరుల నుండి సహకారాన్ని ఆశించవచ్చు, కానీ పరిమిత మద్దతుతో అసంతృప్తి చెందవచ్చు, ఇది ప్రజల నుండి దూరమవుతుంది.

**మకర రాశి...(ఉత్తరాషాఢ 2 3 4, శ్రవణం 1 2 3 4, ధనిష్ఠ 1 2 పాదాలు) (నామ నక్షత్రములు: భ,జా,జి,ఖి,ఖు,ఖే,ఖో,గా,గి)**

శత్రువులు మరియు కృషి: శత్రువులు హాని కలిగించవచ్చు, కానీ కష్టపడి పనిచేయడం సవాళ్లను అధిగమించడంలో సహాయపడుతుంది.

వృత్తిపరమైన విభేదాలు: వృత్తిపరమైన రంగంలో విభేదాలు గౌరవాన్ని కోల్పోవడానికి దారితీయవచ్చుబీ వాటిని నివారించడం మంచిది.

దానధర్మాలు మరియు ఖర్చులు: దానధర్మాలు మరియు దోష నివారణ చర్యల కోసం చేసే ఖర్చులు మంచి ఫలితాలను ఇస్తాయి.

సంభాషణ మరియు వాగ్దానాలు: ఆర్థిక విషయాలలో జాప్యాలు మరియు సమస్యలను నివారించడానికి మీ మాటలు మరియు వాగ్దానాల విషయంలో జాగ్రత్తగా ఉండండి.

**కుంభ రాశి...(ధనిష్ట 3 4, శతభిషం 1 2 3 4, పూర్వాభాద్ర 1 2 3 పాదాలు) (నామ నక్షత్రములు: గూ, గే, గో, సా, సి, సు, సే, సో, దా)**

కుటుంబ విభేదాలు: సంతాన ఆలోచనలు మీతో ఏకీభవించకపోవచ్చు, ఇది విభేదాలకు దారితీస్తుంది. సమన్వయం పాటించాలి.

తండ్రి ఆరోగ్యం: మీ తండ్రి ఆరోగ్యం పట్ల అదనపు శ్రద్ధ వహించండి.

ఆర్థిక లాభాలు: చట్టబద్ధమైన లాభాలను పొందండి, ఇది ఆనందానికి దారితీస్తుంది. ఆశించిన కొనుగోలు పట్ల శ్రద్ధ వహిస్తారు

ఆశీర్వాదాలు మరియు అసంతృప్తి: తండ్రి మరియు పెద్దల నుండి ఆశీర్వాదాలు పొందండి, కానీ సహకారం మరియు ఆర్థిక విషయాలలో అసంతృప్తిని ఎదుర్కోవచ్చు. ఉన్నత విద్యా విషయంలో అభివృద్ధి కొరకు కష్టపడి కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు

**మీన రాశి...(పూర్వాభాద్ర 4,ఉత్తరాభాద్ర 1 2 3 4,రేవతి 1 2 3 4 పాదాలు)(నామ నక్షత్రములు: దీ , దు, ఇం, ఝ, థా, దే, దో, చా, చి)**

గృహ సవాళ్లు: వాహనం, ఇల్లు మరియు విద్య విషయాలలో విభేదాలు మరియు సమస్యలకు అవకాశాలు.

ఆరోగ్యం మరియు ఖర్చులు: అనవసరమైన ఖర్చులు మరియు ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు.

కెరీర్ గౌరవం: మీ కెరీర్లో కష్టపడి పనిచేసినందుకు గౌరవం పొందుతారు. అభివృద్ధి ఉంటుంది.

ఆర్థిక జాగ్రత్త: దీర్ఘకాలిక పెట్టుబడులు, కొనుగోలు విషయాలు మరియు లావాదేవీలలో మోసపోయి డబ్బు కోల్పోకుండా జాగ్రత్త వహించండి.

**రెమెడీస్ – గురుగ్రహ ఇబ్బందులను అధిగమించడానికి**

– దత్తాత్రేయ చరిత్ర పారాయణ
– గురువారం దేవాలయ సందర్శన
– శ్రీ దత్త శరణం మమ శ్లోకాన్ని
ొ– ఇతరులకు జ్ఞానాన్ని పంచగలగడం
–పెద్దలను గురువులను గౌరవించడం
–గురువారం ఆవుకి అరటిపళ్ళు
– శనగలు దానం చేయడం దానాలు
– మంచి ఫలితాలు ఇస్తాయి

డా. ఈడుపుగంటి పద్మజారాణి
జ్యోతిష్యము & వాస్తు నిపుణురాలు
౦91 93930 07560, ౦91 98492 50852

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
18.5.2025






టాలీవుడ్ శ్రద్ధా శ్రీనాథ్ తెలుగు ప్రేక్షకులకి పరిచయం అవసరం లేని పేరు. కెరీర్ ప్రారంభం నుండి వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తుంది. 'జెర్సీ' 'కృష్ణ అండ్ హిజ్ లీల' 'డాకు మహారాజ్' వంటి హిట్లు ఈమె ఖాతాలో ఉన్నాయి. ఇక ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన 'కలియుగమ్ 2064' ఈ మే 9న రిలీజ్ అయ్యింది. ట్రైలర్ తో ఓ సెక్షన్ ఆఫ్ ఆడియన్స్ ను ఆకర్షించిన ఈ సినిమా.. ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉందో లేదో ఈ రివ్యూ ద్వారా తెలుసుకుందాం రండి..

**కథ..**మూడో ప్రపంచ యుద్ధం జరిగిన తర్వాత 2064 లో కరువులు వస్తాయి. మనుషులు తినడానికి ఫుడ్ ఉండదు. నెలలు తరబడి తినడానికి తిండి లేక వాళ్ళ మైండ్ పనిచేయదు. దీంతో ఏవేవో ఘోరమైన వాటికి పాల్పడతారు. అయితే మరోపక్క డబ్బున్నోళ్లు రెసిడెంట్స్ గా ఒక నగరాన్ని నిర్మించుకుంటారు. అక్కడికి వెళ్లి సుఖంగా బ్రతకాలనేది ఈ కరువులో ఉన్న జనాల కోరిక. వీళ్ళ కోసం అండగా నిలబడతామని ఓ వర్గం లిబరేటర్స్ గా మారతారు. అందులో ఒకడు శక్తి(కిషోర్). ఇతని టీం అంతా రెసిడెన్స్ చేతిలో మరణిస్తారు. ఇతను మాత్రం తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుండగా ఓ సేఫ్ హౌస్ గురించి తెలుస్తుంది. వెంటనే అక్కడికి వెళ్తాడు. అక్కడ థామస్ (ఇనియన్ సుబ్రమణి) ఇతనికి తిండి, నీరు ఇచ్చి చేరదీస్తాడు. బయట జనాలు తిండి లేక కొట్టుకుని చనిపోతుంటే.. ఇతనికి మాత్రం ఇన్ని సుఖాలు ఎలా దక్కాయి? అని భావించి థామస్ ను చంపి.. ఆ సేఫ్ హౌస్ ను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తాడు శక్తి. అయితే ఇంతలో అతనికి భయంకరమైన షాక్ ఇస్తాడు థామస్. అదేంటి? మరోపక్క అదే ఇంట్లోకి భూమి (శ్రద్దా శ్రీనాథ్) ఎందుకు వచ్చింది? మధ్యలో కల్కి ఎవరు? ఈ ప్రశ్నలకి సమాధానమే మిగిలిన సినిమా.

**విశ్లేషణ..**'కలియుగమ్ 2064' టైటిల్ ను బట్టి, ట్రైలర్ ను బట్టి ఈ సినిమా కథాంశం ఎలా ఉండబోతుందో అందరికీ ఒక క్లారిటీ వచ్చేసింది. క్యాప్షన్లో కూడా 'విట్నెస్ ది వరస్ట్ ఆఫ్ హ్యుమానిటీ' అని ఉంది. సో దర్శకుడు ప్రమోద్ సుందర్ ఏం చెప్పాలనుకున్నాడో.. ఏం చూపించబోతున్నాడో ముందుగానే ఒక క్లారిటీ ఇచ్చేశాడు. దానికి తగ్గట్టు ప్రిపేర్ అయ్యి వెళితే.. ఆడియన్ ఎక్కడా డీవియేట్ అవ్వకూడదు. సినిమా స్టార్టింగ్లో వచ్చే సాయి కుమార్ వాయిస్ ఓవర్ సినిమా కంటెంట్ పై మరింత క్లారిటీ ఇస్తుంది. సముద్రం ఎండిపోవడం, ఫుడ్ ట్రక్ బ్లాస్ట్ అవ్వడం వంటి సీన్స్, వాటి విజువల్స్ చూడటానికి బాగుంటాయి. కానీ తర్వాత కథనం నెమ్మదించింది. అలాంటి టైంలో ఇంటర్వెల్ వద్ద ఓ ట్విస్ట్ ఇచ్చి సెకండాఫ్ పై ఆసక్తి పెరిగేలా చేశాడు దర్శకుడు. సెకండాఫ్ స్టార్టింగ్ 20 నిమిషాలు బాగానే ఉంటుంది. తర్వాత మళ్ళీ బోర్ కొడుతోంది. క్లైమాక్స్ లో మరో ట్విస్ట్ ఇచ్చాడు. మానవత్వం గురించి ఓ చక్కటి మెసేజ్ ఇచ్చాడు. సో థీమ్ పరంగా, విజువల్స్, ప్రొడక్షన్ వాల్యూస్ పరంగా 'కలియుగమ్ 2064' పాస్ మార్కులు వేయించుకుంటుంది. కానీ ఎంత డీవియేట్ అవ్వాలనుకున్నా.. 'కల్కి 2898 %ూణ%' ఛాయలు ఇందులో ఎక్కువగానే కనిపించాయి. అలా అని దర్శకుడిని తప్పుబట్టాల్సిన అవసరం లేదు. ఎందుకంటే 2023 లోనే ఈ సినిమా ట్రైలర్ వచ్చింది. అంటే 'కల్కి..' కంటే ముందే. కానీ 'కల్కి 2898 ఏడి' చూసిన కళ్ళతో ఈ సినిమాని పూర్తిగా యాక్సెప్ట్ చేయలేము. ఒకవేళ 'కల్కి..' కంటే ముందు వచ్చి ఉంటే.. కచ్చితంగా దీనిని ఆడియన్స్ బాగా రిసీవ్ చేసుకునే అవకాశం ఉండేదేమో.

**నటీనటుల విషయానికి వస్తే..** శ్రద్ధా శ్రీనాథ్ ఇందులో బాగా చేసింది. ఆమె లుక్, ఎక్స్ప్రెషన్స్ వంటివి కూడా మెప్పిస్తాయి. కానీ ఆమె కంటే ఎక్కువగా కిషోర్, అతనికంటే ఎక్కువగా ఇనియన్ సుబ్రమణి మంచి మార్కులు కొట్టేశారు అని చెప్పాలి. మిగతా నటీనటుల మోహాలు గుర్తుపట్టే విధంగా కూడా ఉండవు.

**ప్లస్ పాయింట్స్..** కాన్సెప్ట్ = సినిమాటోగ్రఫీ = ప్రొడక్షన్ వాల్యూస్

**మైనస్ పాయింట్స్..** 'కల్కి 2898 ఏడి' ఛాయలు ఉండటం – కథనం వీక్ గా ఉండటం – ఎడిటింగ్ లోపాలు..

మొత్తంగా.. 'కలియుగమ్ 2064' ఇంతకు ముందు చెప్పుకున్నట్టు 'కల్కి 2898 %ఖుఎ%' కంటే ముందుగా వచ్చి ఉంటే.. కచ్చితంగా ఆడియన్స్ రిసీవింగ్ బెటర్ గా ఉండేదేమో. కథకి బ్లాక్ బస్టర్ పొటెన్షియాలిటీ ఉన్నప్పటికీ.. వీక్ డైరెక్షన్, స్క్రీన్ ప్లే కారణంగా బోర్ కొట్టిస్తుంది. తర్వాత ఓటీటీలో చూస్తే ఇలాంటి నెగిటివ్స్ కనిపించకపోవచ్చు.




గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో దళిత కుటుంబానికి చెందిన సాగర్ (తేజ), సుశీల (తన్మయ) ప్రేమించుకొంటారు. పెళ్లి కాకుండానే శారీరకంగా ఏకం కావడంతో సుశీల గర్భవతి అవుతుంది. ఇడ్లీ సెంటర్ పెట్టాలనుకొన్న సాగర్కు అన్నీ ప్రతికూలంగా మారుతాయి. దాంతో సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశ కారణంగా అప్పుల పాలవుతాడు. ఆ అప్పులు తీర్చి సుశీలను పెళ్లి చేసుకోవడానికి తన స్నేహితుడు దాస్తో కలిసి బస్సు దోపిడి చేయాలని ప్లాన్ వేస్తారు. కానీ దోపిడికి వెళ్తే వారితో విధి మరోలా ఆటలాడి వారిని బస్సు దహనం సంఘటనలో 23 మంది మరణానికి కారణమవుతారు. ఈ కేసులో కోర్టు వారికి మరణశిక్ష విధిస్తుంది. %ూశ్రీంశీ =ఝుఎ% అనసూయతో అసభ్యంగా ప్రవర్తించిన బిగ్ బాస్ నటుడు.. వెనకాల నుంచి వచ్చి ఇడ్లీ కొట్టు పెట్టాలనుకొన్న సాగర్కు రుణం విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి? ఈజీ మనీ సంపాదించడానికి ఎలాంటి వ్యసనాలు అలవాటు చేసుకొన్నాడు? అప్పుల బారిన పడి బస్సు దోపిడికి వెళ్లి కేసులో ఎలా ఇరుక్కుపోయారు? బస్సు దహనం కేసుతో వారికి సంబంధం ఉందా? కోర్టు మరణశిక్ష విధించిన తర్వాత సాగర్, సుశీల కుటుంబాల పరిస్థితి ఏమిటి? సాగర్, దాస్కు మరణశిక్ష విధించారా? చివరకు వారికి జరిగిన న్యాయన్యాయాలు ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానమే 23 సినిమా కథ. సంఘంలో డబ్బు, పరపతి, కులం అనే అంశాలను బట్టే కోర్టులో తీర్పులు, న్యాయం జరుగుతుందనే అపవాదు ఎప్పటి నుంచో అందరిలోనే ఉంది. అలాంటి అనుమానాలకు తావిచ్చే బలమైన సంఘటనలను ఆధారంగా చేసుకొని Box Office Closing Collections కథను ఎంచుకొన్నారు. సమాజాన్ని ఆలోచింపజేసే అంశాలతో దర్శకుడు రాజ్ రాచకొండ రాసుకొన్న పాయింట్స్ బాగున్నాయి. కానీ కథ, సంఘటనలు, ప్రత్యక్ష అనుభవాలు, పరిశోధనలో తెలిసిన వాస్తవాలను ప్రేక్షకుడికి చెప్పాలనే తాపత్రయం కారణంగా ఎమోషన్ స్టోరీని కొన్ని చోట్ల డాక్యుమెంటరీగా మార్చేశాడనిపిస్తుంది.

గుంటూరు జిల్లాలో 1991 సంవత్సరంలో దళితులపై అగ్ర వర్ణాలు దాడి చేసి 8 మందిని హత్య చేస్తారు. కానీ అగ్రవర్ణాల వారిని కోర్టు ఎలాంటి శిక్ష లేకుండా వదిలేస్తుంది. ఇక 1997 సంవత్సరంలో పరిటాలను హత్య చేయడానికి మద్దెల చెరువు సూరి చేసిన జూబ్లీహిల్స్ బాంబు కేసులో 28 మంది మృత్యువాత పడుతారు. కానీ నిందితులకు సత్ప్రవర్తన పేరుతో శిక్ష నుంచి మినహాయింపు పొందుతారు. కానీ చిలకలూరిపేట బస్సు దహనం కేసులో సాగర్, దాస్కు ప్రత్యక్ష సంబంధం ఉందనే సాక్ష్యాలు లేకపోయినా మరణశిక్ష విధిస్తారు. అందుకు కారణం వారిద్దరూ తక్కువ కులం కావడమే అనే అనుమానం కలుగుతుంది. ఇలా సమాజాన్ని ప్రభావితం చేసే వారికి ఓ న్యాయం.. అణగారిన ప్రజలకు కోర్టుల తీర్పు మరోలా ఉంటుందనే పాయింట్పై దర్శకుడు రాజ్ ఆర్ సెటైరిక్గా కథను చెప్పే ప్రయత్నంలో నిజాయితీ కనిపిస్తుంది. కానీ కథను ఎంత వరకు చెప్పాలి? సన్నివేశాలను ఎంత గ్రిప్పింగ్ చూపించాలనే విషయం నుంచి ట్రాక్ తప్పి..నిజాయితీగా వాస్తవాలను చెప్పాలని చేసిన ప్రయత్నం వల్ల నిందితులపై ఎలాంటి సానుభూతి రిజిస్టర్ కాలేకపోయిందని అనిపిస్తుంది. కథలో సాగర్, సుశీల పాత్రలు అత్యంత భారమైనవి.. ఎలాంటి అనుభవం లేకున్నా.. తమ ప్రతిభతో వాటిని సజీవంగా మార్చడంలో తేజ, తన్మయ సక్సెస్ అయ్యారు. దాదాపు ఎక్కువ భాగం కథలో భావోద్వేగాలను పండించడంలో ఇద్దరూ పోటీపడి నటించారు. ఇక యాంకర్ ఝాన్సీ, తాగుబోతు రమేష్ లాంటి పేరున్న ఆర్టిస్టులు తమ టాలెంట్, నటనతో సినిమాకు మరింత బలాన్ని ఇచ్చారు. ఈ చిత్రంలో నటించిన ప్రతీ ఒక్కరు కూడా పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు తపన పడ్డారు. పాపులర్ యాక్టర్లు లేరనే లోపాన్ని లేకుండా తమదైన శైలిలో సినిమాకు వందశాతం న్యాయం చేశారు. కథలో ఉండే మట్టి వాసనను గుభాలింప చేశారు. 23 మూవీ సినిమాకు సినిమాటోగ్రఫి, మ్యూజిక్, దర్శకత్వం విభాగాలు బలంగా నిలిచాయి. సన్నీ కూరపాటి చిత్రీకరించిన సన్నివేశాలు సహజంగా ఉన్నాయి. లైటింగ్, బ్యాక్ డ్రాప్కు ఉపయోగించిన వాతవారణం కథకు యాప్ట్ అయిందనిపిస్తుంది. మార్క్ కే రాబిన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పలు సన్నివేశాలను ఎలివేట్ చేసింది. పాటలు వినగానే క్యాచీగా లేకపోయినా.. దృష్టి వింటే మంచి సాహిత్యం వినిపిస్తుంది. ఎడిటర్ అనిల్ ఆలయం కొంత కఠినంగా వ్యవహరించి కత్తెర్లు భారీగా వేసి ఉంటే.. సినిమాలో వేగం పెరిగేది. ఎమోషన్స్ పండేవనిపిస్తుంది. నిర్మాణ విలువలు బాగున్నాయి.

రాజకీయంగా పలుకుబడి ఉండే వారికి కోర్టులు ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయం అందిస్తాయనే విమర్శలను మరోసారి గుర్తు చేసే ప్రయత్నమే 23 సినిమా. బస్సు దహనం సంఘటనలో తప్పుఒప్పులు పక్కన పెడితే.. చుండూరులో 8 మందిని చంపిన అగ్ర కులాల వారికి ఓ న్యాయం.. జూబ్లీహిల్స్ కారు బాంబు కేసులో నిందితులకు మరో న్యాయం కోర్టులు, ప్రభుత్వాలు అందించడాన్ని ఎత్తి చూపడంలో దర్శకుడు రాజ్ సక్సెస్ అయ్యారు. కమర్షియల్ అంశాల జోలికి వెళ్లకుండా హానెస్ట్గా స్టోరిని చెప్పడానికి ప్రయత్నించినందుకు ఆయనను అభినందించాలి. స్క్రిప్టులో, కథను నడిపించిన విధానంలో కొన్ని లోపాలు ఉన్నా పట్టించుకోకుంటే.. ఈ సినిమా కథలోని సారం బోధపడుతుంది. అన్ని విషయాలను ఒకే చూపుతో చూడొద్దంటారు. మీ దృష్టిని, ఆలోచనను మార్చుకొని ఈ సినిమా చూస్తే.. తప్పకుండా 23 మూవీ నచ్చుతుంది.

విశాఖపట్నంలో వరుస హత్యలు పోలీసులకు సవాల్గా నిలుస్తాయి. ఆ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీస్ అధికారి రంజిత్ (శశాంక్) యాక్సిడెంట్ గురి అవుతాడు. దాంతో ఆ కేసు విచారణ బాధ్యతను సిన్సియర్ అండ్ స్మార్ట్ పోలీస్ ఆఫీసర్ ఏసీపీ అరవింద్ (నవీన్ చంద్ర)కు అప్పగిస్తారు. బెంజమిన్ అనే సైకో ముసుగేసుకొని సీరియల్ కిల్లింగ్కు పాల్పడుతున్నాడని ఏసీపీ అరవింద్ తెలుసుకొంటాడు. తన సహచర ఆఫీసర్ మనోహర్తో కలిసి సైకోను పట్టుకొనేందుకు వేట మొదలు పెడుతాడు.

. వెనకాల నుంచి వచ్చి సైకో బెంజమిన్ ఎవరు? ఎందుకు సైకోగా మారాడు? ముసుగు వేసుకొని ఎందుకు హత్యలు చేస్తుంటాడు? ఈ హత్యలు చేయడానికి ప్రధాన కారణం ఏమిటి? చివరకు బెంజమిన్ను అరవింద్ పట్టుకొన్నాడా? హత్యల వెనుక మాస్టర్ మైండ్ ఏమిటి? అనే ఇంట్రెస్టింగ్ ప్రశ్నలకు సమాధానమే లెవన్ సినిమా కథ. సైకాలజికల్, హ్యూమన్ ఎమోషన్స్తో ఉండే స్టోరీ పాయింట్ను దర్శకుడు లోకేష్ ఎంచుకోవడంలోనే తప్పటడుగు వేశాడని చెప్పవచ్చు. ఓ కుర్రాడిని ఆటపట్టించడానికి పిల్లలు చేసిన తప్పుకు అంత మందికి అంత పెద్ద శిక్ష వేయడమనేది లాజిక్కు దూరంగా అనిపిస్తుంది. కానీ కథను నడిపించిన తీరు, సన్నివేశాలను రాసుకొన్న విధానం, ఫ్యాష్ బ్యాక్లో హ్యూమన్ ఎమోషన్స్ జొప్పించిన తీరు బాగుంది. కథలో నాలుగైదు చోట్ల దర్శకుడి ప్రతిభ







ప్రశంసించేలా ఉంటుంది. మిగితా అంతా రొటీన్గా సాగడం ఈ సినిమాలో ఓ లోపంగా కనిపిస్తుంది. ఇంటర్వెల్లోను క్లైమాక్స్లో రెండు ట్విస్టులు ఫీల్గుడ్గా ఉంటాయి. కథను నడిపించడానికి ఎంచుకొన్న బేసిక్ పాయింట్ కన్విన్సింగ్గా లేదనిపిస్తుంది.

ఏసీపీ అరవింద్గా ఈ సినిమా భారాన్నంత నవీన చంద్ర మోశాడు. రెండు రకాల షేడ్స్ ఉన్న పాత్రలో ఒదిగిపోయాడు. పాత్రలోని వేరియేషన్స్కు తగిన ఎమోషన్స్ను, బాడీ లాగ్వేంజ్ను, యాటిట్యూడ్ను చక్కగా పలికించాడు. మనోహర్ పాత్రను చేసిన యాక్టర్ ఆకట్టుకొనే ప్రయత్నం చేశాడు. హీరోయిన్ రేయా, అలాగే కిరిటీ, శశాంక్ రోల్స్ కథలో కీలకమే కానీ..వాటికి పెద్దగా ప్రాముఖ్యత ఇవ్వకపోవడంతో వారు కూడా ఏమి చేయలేకపోయారు. అభిరామి, రవివర్మ కథకు కావాల్సిన ఎమోషన్స్ను నింపే పాత్రల్లో కనిపించారు. లెవన్ సినిమాకు ఇమ్మాన్ మ్యూజిక, కార్తీక్ అశోకన్ సినిమాటోగ్రఫి, ఎడిటింగ్ విభాగం పనితీరు బాగుంది. చాలా సన్నివేశాలకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్లస్ అయింది. నైట్ ఎఫెక్ట్ షాట్స్ను, ఛేజింగ్ సీన్స్ను కార్తీక్ బాగా షూట్ చేశాడు. ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్లో కట్ షాట్స్తో ట్విస్టులను రివీల్ చేసిన విధానం చూస్తే ఎడిటర్ శ్రీకాంత్ వర్క్ ఇంప్రెసివ్గా ఉంది. అజ్మల్ ఖాన్, రేయా హరి అనుసరించిన ప్రొడక్షన్ వాల్యూస్ బాగున్నాయి. కవల పిల్లల్లో ఒకరిపై మరొకరికి ఉండే ఎమోషనల్ బాండింగ్ను బేస్ చేసుకొని రాసుకొన్న క్రైమ్ థ్రిల్లర్. స్టోరీకి బేస్ అయిన బేసిక్ పాయింట్ లాజిక్ లెస్గా ఉండటం వల్ల సినిమాకు కనెక్ట్ కావడానికి ఇబ్బందిగా అనిపిస్తుంది. ఈ లోపాన్ని నవీన్ చంద్ర తన పెర్ఫార్మెన్స్తో కప్పిపుచ్చాడు. దర్శకుడు అనుసరించిన స్క్రీన్ ప్లే, రాసుకొన్న ట్విస్టులు ఈ సినిమాకు కొంత పాజిటివ్గా మార్చాయి. సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్లు ఇష్టపడే వారికి ఈ సినిమా నచ్చుతుంది.

# ద్వాదశరాశి ఫలములు (వార ఫలాలు)

సూర్య
www.suryaa.com
18.5.2025

## 18.5.2025 నుంచి 24.5.2025 వరకు



**గమనిక: గోచారఫలాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు**

### మేషరాశి

అశ్విని 1,2,3,4 పాదములు - భరణి 1,2,3,4 పాదములు
కృతిక 1వ పాదము

వారం ప్రారంభంలో వృత్తి విషయంలో ఆలో చనలు. వృత్తిపరంగా ఊహించని వ్యక్తుల సహకారం కొరకు ఆకస్మిక అవకాశాలు. సంతానం యొక్క ఆరోగ్యం, మీ సృజనాత్మకత అనుకూలంగా ఉంటాయి. వారం మధ్యలో ఆగుతూ వస్తున్న అభివృద్ధిలో ఆత్మీయులు అనుకున్న వ్యక్తుల స్వార్ధ ఆలోచనలు ఇబ్బందిని, ఘర్షణని కలిగిస్తాయి. నిర్ణయ సామర్థ్యంలో, కమ్యూనికేషన్ విషయంలో, ఎదుగుదల సుదీర్ఘ ఆలోచనలు కలిగిస్తాయి.రాహు కుంభం, కేతు సింహం, గురు మిథున రవి వృషభ స్థానాలా ప్రభావం ఆర్థిక, లాభపరమైన అం శాలలో ఎదురుచూస్తున్న వర్తమానాలు అందుకుంటారు. స్థిరాస్తులు భూములు కొనుగోలు విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, కొత్త వ్యక్తులను, వారి ఆలోచనలను నమ్మే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తూ అనవసర వ్యయములు, ప్రలోభాలకు లొంగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

### వృషభరాశి

కృతిక 2,3,4 పాదములు - రోహిణి 1,2,3,4 పాదములు
మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో ఆత్మ విశ్వాసం కొంత తగ్గుతుంది దూర ప్రయాణములకి అవకాశము, మీఆర్థిక, ఆరోగ్య, రుణములు పోటీలు అంశాలలో పెద్దల సలహా, సహ కారం ఆశిస్తారు. ముఖ్యంగా తల్లి తండ్రుల ఆరోగ్య, సౌకర్య, అవసరాల కోసం దృష్టి సారిస్తారు. ఉన్నత విద్య కొరకు ఎదురు చూసే విద్యార్థులకి విద్యావిషయాల్లో, పోటి ల్లో కొంత సామాన్య ఫలాలు. ప్రస్తుతం ఉన్న వృత్తిలోబాధ్య తలు, నూతన శ్రమ. కొత్త పనులు, వ్యక్తుల పరిచయాలు. మోసానికి అవకాశములు. జీవిత భాగస్వామికి వృత్తిలో అవకాశములు దూర ప్రదేశముల్లో, మిత్రులు కొల్లీగ్స్ తో అభిప్రాయ బేధములు రాకుండా వ్యవహారించాలి. గృహ సంబంధ విషయాల్లో ఖర్చులు. పాత ఋణములు, వైరాగ్యఆలోచనలు చికాకులు. నిర్వేదాని అధిగమించే దిశగా ప్రయత్నించాలి. వారము మధ్యలో వారాంతంలో కుటుంబ స్త్రీల ఆరోగ్యముకై శ్రద్ధ.

### మిధునరాశి

మృగశిర 3,4 పాదములు - ఆరుద్ర 1,2,3,4 పాదములు
పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోప్రయాణాలు చేసేటప్పు డు స్వార్థపూరితమైన వ్యక్తుల పరిచయాల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సంతానమునకు విద్య సంబంధ మైన విషయాల్లో అభివృద్ధి ఆశించిన ఫలితాలు పొందు తారు. శక్తి మించిన ఖర్చులు, రాహు కుంభ కేతు సింహ ప్రవే శం తో ఉన్నత విద్యకు సంబంధించిన విషయాలలో దూర ప్రదేశాలలో అవకాశాలు విదేశాలలో ఉండే ఆత్మీ యుల సహకారంతో అభివృద్ధి. ఆత్మ శక్తి పెరుగుతుంది. వారం మధ్యలో దూర ప్రయాణాలు, కమ్యూనికేషన్ విషయంలోనూ నిర్ణయాలు తీసుకునే సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మిత్రులతో, తోబుట్టువులతో వివాదాలకి దూరంగా ఉండాలి. మాట్లాడేటప్పుడు గౌరవం ఇచ్చి గౌరవం తీసుకోవాలి. నిరుద్యోగులకు, వృత్తి లో అభివృద్ధి కొరకు ప్రయత్నం

### కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము - పుష్యమి 1,2,3,4 పాదములు
ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో రాహు కుంభ రాశిలోనూ కేతు సింహరాశిలోనూ మార్పులు, అదేవిధం గా రవి వృషభ రాశి లోనూ, గురు భగవానుడు మిథున రాశిలోనూ ప్రయాణాన్ని గమనిస్తే, జీవిత భాగస్వామి అభివృద్ధి, వ్యక్తిగత వృత్తి మొదలైన వాటి కొరకుఅనుకోని ఖర్చులు, ఆలోచనలు, నూతన పరిచయాలు, మైత్రి బంధాలు బలపడతాయి. దూర ప్రదేశాలలో వ్యాపార విస్తరణ అంశాలలో ఆలోచనలు. ఆర్థిక సంబంధమైన అం శాలలో ఆలోచనలు అనుకూలం. వారం మధ్యలో ఆరోగ్య, ప్రయాణ, సంబంధ విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యమైన పనులు వాయిదా పడే అవకాశం ఉంది. రోగ నిరోధక శక్తి విషయంలో తగిన విధంగా జాగ్ర త్తలు తీసుకోవాలి. కుటుంబ సంబంధ వ్యవహారాల్లోనూ, మాటలలో ఉద్వేగం కోపాన్ని నియంత్రించుకోవాలి. స్వార్థపూరితమైన ఆలోచన ఆత్మీయులు దూరం

### సింహరాశి

మఖ 1,2,3,4 పాదములు - పుబ్బ 1,2,3,4 పాదములు
ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలోబంధువులతో విభే దాలు రాకుండా జాగ్రత్త వహించాలి. ఆధ్యాత్మిక ప్రయా ణాలు, గురువుల యొక్క సహకారం, ఆశీస్సులు, మధ్యలో నూతన స్నేహ సంబంధాలు, మైత్రి బంధాలు బలపడ తాయి. రాహు కుంభరాశిలోనూ కేతు సింహరాశిలోనూ మార్పులు, అదేవిధంగా రవి వృషభ రాశి లోనూ, గురు భగవానుడు మిథున రాశిలోనూ ప్రయాణాన్ని గమనిస్తే ఆరోగ్యం, ఆహారం విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. శ్రమ వ్యక్తిగత అభివృద్ధి కొరకు ప్రయత్నాలు అధికంచేస్తారు. నూతన అవకాశాలు. గుర్తింపు, నూతన వాహనాల కొరకు ప్రయత్నాలు చేస్తారు. ఆర్థిక సంబంధమైన లాభం కన్నా, గౌరవం పెరుగుతుంది. వృత్తి విషయాలలో, సంతానం అభివృద్ధి ఆరోగ్య విషయాలలో ఘర్షణ. ఆలోచనలలో అధిక ఉద్వేగాలను నియంత్రించుకోవాలి. గృహ అలంకార నిమిత్తం, కొత్త పుస్తకాల కొనుగోలు

### కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు - హస్త 1,2,3,4 పాదములు
చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలోరుణములు తీసుకునే ప్రయత్నాలు, ఇంతకుముందు మీ దగ్గర రుణములు తీసుకున్న వారు సమయానికి ఇవ్వడంలో జాప్యం. రాహు కుంభ రాశిలోనూ కేతు సింహరాశి లోనూ మార్పులు, అదేవిధంగా రవి వృషభ రాశి లోనూ, గురు భగవానుడు మిథున రాశిలోనూ ప్రయాణాన్ని గమనిస్తే సంతానం అవసరాల నిమిత్తం ఖర్చు. వారి ఆరోగ్య, అభివృద్ధి అంశాలలో ప్రత్యేక శ్రద్ధ. స్థిరాస్తుల పై పెట్టుబడుల కొరకు ఆలోచనలు అధికం. వృత్తి చేసే ప్రదేశంలో అధిక బాధ్యతలు శ్రమ గౌరవం ఉన్నప్పటికీ అనవసర వ్యక్తుల ప్రవర్తన, జోక్యం చికాకు కలిగిస్తుంది. తల్లిదండ్రుల ఆరోగ్య విషయంలోనూ, దూరవిద్యా, న్యాయ సంబంధ విషయంలోనూ ఖర్చులు అధికంగా ఉంటాయి. అనవసర ఖర్చులు, ఇబ్బంది కలిగించే అలవాట్లకు, వ్యసన పరులైన స్నేహాలకు దూరంగా ఉండటం మంచిది.

### తులారాశి

చిత్త 3,4 పాదములు - స్వాతి 1,2,3,4 పాదములు
విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోతల్లి గారి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు స్తిరాస్తుల, వ్యవ సాయ సంబంధ పెట్టుబడుల కొరకు, స్వగ్రామ సందర్శన కొరకు తల్లితో సంప్రదిస్తారు. విద్య సంబంధమైన విషయాల కొరకు, నూతన విషయాలు గ్రహించుటలో శ్రమ చేస్తారు. ఆరోగ్యముకి శ్రద్ధ తీసుకోవాలి, సమయానికి ఆహారము విశ్రాంతి అవసరం.నూతన పెట్టుబడులు, వ్యాపార విస్తర ణలో నూతన పరిచయాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉ ండడం చాలా మంచిది. విద్యార్థులు జ్ఞాపకశక్తి విషయంలో శ్రీ హయగ్రీవాయ నమః మంత్రం జపించుట మేలు. ఆలోచనలు ప్రతిపాదించుటలో ఆలస్యం కాకుండా జాగ్రత్త గా ముందుకు సాగాలి. ఇతరులకు సహకరించడంలో స్వార్థం తో ఆలోచించడం వలన ఆశించిన లాభాలు తగ్గుతాయి. సంతానం అభివృద్ధి పెట్టుబడులు ఇన్వెస్ట్మెంట్ విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

### వృశ్చిక రాశి

విశాఖ 4వ పాదము - అనురాధ 1,2,3,4 పాదములు
జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోవ్యక్తుల సహకారంతో నూతన ఆలోచనలని అమలు పరచడానికి ప్రయత్నాలు చేస్తారు. వృత్తిపరమైన విషయంలోసామర్థ్యాలు పెరుగు తాయి, నిరుద్యోగులకు ఉద్యోగం కొరకు ప్రయత్నం చేసే వారికి అవకాశాలు. దూర ప్రదేశాలలో ఇంటర్వ్యూలు. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రాహుకుంభ ప్రవేశం, కేతు సింహ ప్రవేశం తో, విద్యార్థులకు విద్యాపరమైన విషయాలలో పోటీలలో అనుకున్న ఫలితాలు. స్థిరాస్తుల అభి వృద్ధి కొరకు ప్రయత్నాలు సామాన్య ఫలాలు. ఎక్కువ అనవసర ఆలోచనలతో హృదయాందోళన. సంతానముతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించాలి. క్రీడారంగంలో ఉండే వాళ్ళు పోటీలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు. ఆధ్యాత్మిక ప్రదేశాలు పై దృష్టి, మీ ఆలోచనలకి వారి ఆలోచనలకి సమన్వయం లేకపోవడం వల్ల చికాకులు. ముఖ్యంగా స్నేహముల విషయంలోనూ శ్రద్ధ

### ధనస్సు రాశి

మూలా 1,2,3,4 పాదములు -
పూర్వాషాడ 1,2,3,4 పాదములు - ఉత్తరాషాడ 1వ పాదము

వారం ప్రారంభంలో కుటుంబంతో కలిసి చర్చలు, ఆర్థిక సంబంధాలలో ఆలోచనలు. ఆధ్యాత్మిక క్షేత్ర సందర్శన, దైవ దర్శనం దూర ప్రయాణాలు. వ్యాపార విస్తరణ కొరకు ఆలోచనలు. ఎక్కువ శాతం సోషల్ మీడియా, స్క్రీన్ టైమ్ తో సమయాన్ని వృథా చేసుకోకుండా ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. వారం మధ్యలో ముఖ్య అంశాలలో స్థిరాస్తులు విషయంలో తోబుట్టువులతో వాదనలకు దూరంగా ఉండాలి. రాహు కుంభ ప్రవేశం, కేతు సింహ ప్రవేశం, గురు మిథున రవి వృషభ స్థానాలు తో సామర్థ్యం పరాక్రమం పెరుగుతాయి, మిత్ర బృందం సహకరిస్తారు, రహస్య శత్రువులు ఇబ్బంది పెట్టడానికి చేసే ప్రయత్నాల్లో వారి మీద, విజయాన్నిసాధిస్తారు. రోగ నిరోధక శక్తి విషయంలో, బంధుమిత్రులతో జాగ్రత్తలు తీసుకోవాలి. వృత్తి విషయంలో శ్రద్ధ వహించాలి.విద్యార్థులు పోటీ పరీక్షలు, అభివృద్ధి విషయంలో తగిన కృషి చేయాలి

### మకరరాశి

ఉత్తరాషాడ 2,3,4 పాదములు - శ్రవణం 1,2,3,4 పాదములు
ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో కుంభ రాహు, సింహ కేతు, రవి వృషభ, గురు మిథున స్థానాలు, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, నాయకత్వ లక్షణాలు. ఆరోగ్య విషయం అనుకూలత. కుటుంబ, ఆహార, ఆర్థిక విషయాలలో, కొత్త వ్యక్తులతో వాగ్వాదానికి, వివాదాలకు దూరంగా ఉ ండాలి. కుటుంబ సభ్యుల, ముఖ్యంగా సంతానము ఆరోగ్య, అభివృద్ధి విషయంలోనూ, గృహంలో స్థిరాస్తుల కొరకు లోన్ తీసుకునే విషయంలోనూ దృష్టి సారిస్తారు. ఆత్మీయుల ఆరోగ్య, అభివృద్ధి కొరకు ఉద్వేగంతో కూడిన ఆలోచనలు. దగ్గర ప్రయాణాలకు, మిత్రులతో సంప్రదింపులకు అవకాశం. వృత్తిలో కమ్యూనికేషన్ సమస్యను అధిగమిం చాలి. జీవిత భాగస్వామితో నిదానంగా వ్యవహరిస్తూ భవిష్య ప్రణాళికలను చర్చిస్తూ నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉంది. వారం చివరిలో వాహనాలు నడిపే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

### కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు - శతభిషం 1,2,3,4 పాదములు
పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభం కుంభ రాహు సింహ కేతు వృషభ రవి మిథున గురు గోచారం వ్యాపార విస్తరణ, ప్రయా ణాలు, భాగస్వామ్య వ్యవహారాల విషయంలో జీవిత భాగస్వామి ఆరోగ్య సంతానము కొరకు ఖర్చులు, షాపిం గులు అధికంగా ఉంటాయి. వ్యాపార శ్రమ విశ్రాంతి లోపం కొంత శారీరక నిస్సత్తువ కలిగిస్తుంది. వారంమధ్యలో ఉ త్సా హంగా నిర్ణయాలు తీసుకుంటారు, ముఖ్యంగా స్థిరా స్తులు అభివృద్ధి కొరకు, విద్యార్థుల విద్యా సంబంధ అం శాలు, ఆకస్మిక లాభాలు ఇంతవరకు ఆగిన ఆర్థిక విషయా లు కొంత ముందుకు సాగుతాయి. వారం చివరిలో వ్యక్తిగత సామర్థ్యం పెరుగుతుంది, ఇతరుల సహకారం లేకుండానే సొంత నిర్ణయాలు తీసుకుంటారు. తోబుట్టువులతో మంతనాలు. కుటుంబంలోని సభ్యులతో మాట్లాడేటప్పుడు అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్త తీసుకోవాలి. శారీరక శ్రద్ధ, నూతన భాషలు నేర్చుకోవడానికి ఉత్సాహం

### మీన రాశి

పూర్వాభాద్ర 4వ పాదము -
ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు - రేవతి 1,2,3,4 పాదములు


వారం ప్రారంభంలో నిరుద్యోగులకు నూతన అవకాశాలు, నూతన గృహ వాహన విషయాల కొరకు చేసే ప్రయత్నాలు చాలా అనుకూలంగా ఉంటాయి. ముఖ్యంగా కుంభ రాహు సింహ కేతు ప్రవేశం తో దీర్ఘకాలిక అనారోగ్యాల విషయంలో నిర్లక్ష్యం తగదు. అనవసర వృధా ఖర్చుల విషయంలో చూసి వ్యవహ రించాలి, న్యాయ సంబంధమైన అంశాల మీద చర్చలు ముందుకు సాగుతాయి. దూరపు ప్రదేశాలలో నూతన అవకాశాలు కలిగించినప్పటికీ నిర్ణయ సామర్థ్యం లోపంతో పూర్తిగా సద్వినియోగం చేసుకోలేరు.రుణము లభిస్తుంది, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. విజయము సాధించ డానికి చేసే కార్యక్రమాలలో శ్రద్ధ. ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి. వారం చివరిలో ఘర్షణతో కూడిన మాటల వల్ల వ్యక్తులతో మాట పట్టింపులు.

నిర్వాహణ : స్వర్ణ కంకణ సన్మానిత, జ్యోతిష చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద

**డా. ఈడ్పుగంటి పద్మజారాణి**

ఎమ్మెస్సీ (గణితం), ఎం.ఏ( జ్యోతిషం గోల్డ్‌మెడల్), ఎం.ఏ (ఫలిత జ్యోతిషం), పిజిడిప్లమో (జ్యోతిర్వైద్యం-గోల్డ్‌మెడల్), పిజిడిప్లమో (ఇంజనీరింగ్ వాస్తు), పిహెచ్.డి (జ్యోతిషం-గోల్డ్‌మెడల్)

9849250852 - 7506976164 - padma.suryapaper@gmail.com, www.padmamkuhi.com (అపాయింట్ మెంట్ ద్వారానే సంప్రదించవలెను)



సూర్య
www.suryaa.com
18.5.2025